www.prajanaava.in
Telugu Daily
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 191 | ఆదివారం | 5 జులై, 2026

మిడ్జిల్‌లో నాటిన మొక్క..

మహా వృక్షమైంది

పేదలకు సేవ చేసే భాగ్యం దక్కడం నా అదృష్టం

- పాలమూరు నేల ఎందరో మహానుభావులను దేశానికి అందించింది
- పాలమూరు బిడ్డలు పోర పట్టగలరు... పాలన కూడా చేయగలరు
- మిడ్జిల్ ప్రజల ఆదరణే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది
- మిడ్జిల్ అభివృద్ధి బాధ్యతను భట్టి విక్రమార్క తీసుకోవాలి
- బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో పడింది
- ఒకే కుటుంబానికి వేల ఎకరాల ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి?

> నా రాజకీయ ప్రయాణానికి పునాది వేసిన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు. 2006 జూలై 4న జడ్పీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకొని ఆశీర్వదించారు. ఈ ప్రాంతానికి చెందినవాడిని కాకపోయినా నమ్మకంతో గెలిపించారు. అదే విశ్వాసం నన్ను ముఖ్యమంత్రి స్థాయికి తీసుకొచ్చింది. పేదలకు సేవచేసే అవకాశం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నా. పాలమూరు జిల్లా దేశానికి గొప్ప నాయకులను అందించింది.
>
> “ గత ప్రభుత్వం రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టింది. ఏ గ్రామంలోనైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తిస్థాయిలో ఇచ్చిందా? మూడెకరాల భూమి పంపిణీ చేశారా.. కోటి ఎకరాలకు సాగునీరు అందించారా? ఇంటికో ఉద్యోగం కల్పించారా? నేరెళ్లలో ఇసుక దోపిడీని అడ్డుకున్న దళితులపై లారీలతో దాడులు జరిగాయి. గత పదేళ్లలో ఒకే కుటుంబానికి తప్ప మరెవరికీ ఉద్యోగాలు, పదవులు దక్కలేదు.
>
> – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజానావ, మహబూబ్‌నగర్: 2006లో మిడ్జిల్ ప్రజలు నాటిన రాజకీయ మొక్క నేడు మహావృక్షంగా ఎదిగి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితానికి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన రాజకీయ కృతజ్ఞతా సభలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణానికి పునాది వేసిన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 2006 జూలై 4న జడ్పీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకుని ఆశీర్వదించారని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి చెందినవాడిని కాకపోయినా నమ్మకంతో గెలిపించారని, అదే విశ్వాసం తనను ముఖ్యమంత్రి స్థాయికి తీసుకొచ్చిందన్నారు. పేదలకు సేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పాలమూరు జిల్లా గొప్ప నాయకులను దేశానికి అందించిందని సీఎం అన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వంటి మహానుభావులు ఈ నేలపై పుట్టారని చెప్పారు. పాలమూరు బిడ్డలు కేవలం పోర పట్టడమే కాదు, సమర్థంగా పాలన కూడా చేయగలరని వ్యాఖ్యానించారు. 2006లో మహబూబ్‌నగర్ జిల్లాలో అనేక మండలాలు డార్క్ మండలాలుగా ఉండేవని గుర్తు చేసిన ఆయన, తన రాజకీయ జీవితానికి కీలకమైన మిడ్జిల్‌కు ప్రత్యేకంగా సేవ చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి బాధ్యతలు స్వీకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సభ వేదికగా కోరారు.

అధికార దుర్వినియోగం చేయలేదు

తాను ఎప్పుడూ పదవిని, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదని సీఎం స్పష్టం చేశారు. వందేళ్లుగా జరగని కులగణనను తెలంగాణలో చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని తెలిపారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్‌ను దొర గడీ ముందు గంటల తరబడి నిలబెట్టిన పరిస్థితులను ప్రజలు మరిచిపోరని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఆ కలను ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి, రూ.70 వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వం ఏ గ్రామంలోనైనా డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తిస్థాయిలో ఇచ్చిందా, మూడెకరాల భూమి పంపిణీ చేశారా, కోటి ఎకరాలకు సాగునీరు అందించారా, ఇంటికో ఉద్యోగం కల్పించారా అని

తరువాయి 2లో..

రేవంత్‌రెడ్డి నిజమైన ప్రజా నాయకుడు

- పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారు
- ప్రజలకు కృతజ్ఞతలు చెప్పేందుకు రావడం ఆయన గొప్ప సంస్కారానికి నిదర్శనం
- మిడ్జిల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశంసించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేసే నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తన రాజకీయ జీవితానికి పునాది వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు ముఖ్యమంత్రిగా తిరిగి రావడం ఆయన గొప్ప మనసుకు, ఉన్నతమైన రాజకీయ సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన భారీ కృతజ్ఞతా సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం జడ్పీటీసీగా ఆశీర్వదించిన ప్రజల వద్దకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వచ్చి నమస్కరించడం అరుదైన రాజకీయ సంస్కృతి అని అన్నారు. రేవంత్‌రెడ్డిని తాను దగ్గరగా చూసిన వ్యక్తినని పేర్కొన్నారు.

● వైభవ్ నయా రికార్డ్

ఇంగ్లండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించాడు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకోగా, ఓపెనర్ సంజూ శాంసన్ స్థానంలో వైభవ్‌కు జట్టులో చోటు కల్పించారు. 15 ఏళ్ల 99 రోజుల వయసులో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన వైభవ్.. భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో 1989లో పాకిస్థాన్‌పై 16 సంవత్సరాల 205 రోజుల వయసులో అరంగేట్రం చేసిన సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 37 ఏళ్ల రికార్డు చెరిగిపోయింది.

– మాంచెస్టర్

● కవితకు షాక్

కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి ఇంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది.

● ఉక్రెయిన్ డ్రోన్ షాట్

రష్యాలోని రెండో అతిపెద్ద నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కీలక చమురు టెర్మినల్‌పై ఉక్రెయిన్ శనివారం డ్రోన్ దాడి చేసింది. రష్యా యుద్ధ యంత్రాంగానికి ఆర్థిక బలంగా నిలుస్తున్న ఇంధన మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ వరుస దీర్ఘశ్రేణి దాడులు కొనసాగిస్తోంది.

భారత మామిడి పండ్లతో పాటు ప్రీమియం వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా ప్రధాన రిటైల్ మార్కెట్లలోకి తీసుకెళ్లే లక్ష్యంతో అమెరికాలోని హ్యూస్టన్‌లో రెండు రోజులపాటు 'మ్యాంగో ఫెస్టివల్–ఇండియా షోకేస్' నిర్వహించారు. భారత కాన్సులేట్ జనరల్, గ్రేటర్ హ్యూస్టన్ ఇండో–అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏసీసీజీహెచ్), వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ) సహకరించింది.

12 గంటలు.. 200 మి.మీ. వర్షం!

- ముంబైని ముంచెత్తిన వానలు
- జలమయమైన రహదారులు
- రైళ్లు, రోడ్డు రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నేడు కూడా భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరిక
- పాఠశాలలు, కళాశాలలకు సెలవు
- విఖ్రోలిలో అత్యధికంగా 260 మి.మీ. వర్షపాతం

2

భారత్ ఎన్నికల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం

- ఓటరు జాబితాల కచ్చితత్వాన్ని పెంచిన ప్రత్యేక సవరణ కార్యక్రమం
- బీఎల్‌ఓలే ప్రజాస్వామ్యానికి నిజమైన కాపలాదారులు : సీఈసీ జ్ఞానేశ్ కుమార్

2

ఖమేనీకి అశ్రునివాళి

- లక్షలాది మంది ప్రజలతో టెహ్రాన్‌లో భారీ అంతిమయాత్ర
- ఇజ్రాయెల్, అమెరికాపై ప్రతీకార నినాదాలతో మార్మోగిన వీధులు
- గురువారం మష్హద్‌లోని ఇమామ్ రిజా దర్గాలో ఖననం

ఇరాన్‌లో ఐదు రోజుల అంత్యక్రియలు ప్రారంభం

టెహ్రాన్: ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధం ప్రారంభ దశలో వైమానిక దాడిలో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీకి శనివారం నుంచి ఐదు రోజుల అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. టెహ్రాన్‌లోని గ్రాండ్ మోసల్లా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి లక్షలాది మంది హాజరై నివాళులర్పించారు. జాతీయ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని ప్రత్యేక గాజు శవపేటికలో ఉంచగా, ప్రజలు ఛాతీలు బాదుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఇజ్రాయెల్, అమెరికాపై ప్రతీకారం తీర్చుకోవాలంటూ నినాదాలు చేశారు. ఖమేనీతో పాటు అదే దాడిలో మరణించిన ఆయన కుటుంబ సభ్యుల పార్థివదేహాలను కూడా అంతిమయాత్రలో ఉంచారు. 'మా నాయకుడి మరణానికి ప్రతీకారం తప్పదు' అంటూ వేలాది మంది శోకసంద్రంలో మునిగిపోయారు. నగరమంతా ఖమేనీ చిత్రాలతో కూడిన భారీ హోర్డింగులు ఏర్పాటు చేయగా, భద్రత కోసం భారీగా సాయుధ బలగాలను మోహరించారు. యుద్ధం కొనసాగుతున్న కారణంగా వాయిదా పడిన ఈ అంత్యక్రియలు కొత్త సుప్రీం నాయకుడు అయతొల్లా మొజ్తబా ఖమేనీ నాయకత్వానికి ప్రజా మద్దతు కూడగట్టే వేదికగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

తరువాయి 2లో..

వర్షాకాల సమావేశాలకు ముందే

ఫిరాయింపులపై స్పీకర్ నిర్ణయం

- టీఎంసీ, శివసేన (యూబీటీ) తిరుగుబాటు ఎంపీల భవితవ్యంపై త్వరలో స్పష్టత
- ఈ నెల 20లోపు నిర్ణయం.. అనర్హత పిటిషన్లు, ప్రత్యేక సీటింగ్‌పై కసరత్తు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే జులై 20లోపు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ) తిరుగుబాటు ఎంపీల వ్యవహారంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఫిరాయించిన ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలంటూ మాతృపార్టీలు దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ తుది నిర్ణయం వెలువడనుంది. ఈ వ్యవహారంలో టీఎంసీ తరఫున అభిషేక్ బెనర్జీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో పాటు తిరుగుబాటు ఎంపీల వర్గం వాదనలను కూడా స్పీకర్ వ్యక్తిగతంగా విన్నట్లు సమాచారం. ఇదే తరహాలో శివసేన (యూబీటీ), తిరుగుబాటు ఎంపీల అభిప్రాయాలను కూడా పరిశీలించారు. ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌కు సంబంధించిన అంశాలపై పార్లమెంట్ న్యాయ, రాజ్యాంగ నిపుణులతో సంప్రదింపులు నిర్వహించిన స్పీకర్, గతంలో ఇలాంటి కేసుల్లో లోక్‌సభ స్పీకర్లు, రాజ్యసభ ఛైర్మన్లు ఇచ్చిన తీర్పులను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అన్ని రాజ్యాంగ, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం ప్రకటించనున్నారు.

ఎన్డీఏకు 20మంది టీఎంసీ ఎంపీల మద్దతు

2024 లోక్‌సభ ఎన్నికల్లో టీఎంసీ తరఫున గెలిచిన 29 మంది ఎంపీల్లో 20 మంది పార్టీని వీడి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని కోరడంతో పాటు ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. మరోవైపు శివసేన (యూబీటీ) తరఫున గెలిచిన తొమ్మిది మంది ఎంపీల్లో ఆరుగురు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ఈ ఫిరాయింపులు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌కు విరుద్ధమని, తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని టీఎంసీ, శివసేన (యూబీటీ) స్పీకర్‌ను కోరాయి. రెండు మూడొంతుల మంది శాసనసభ్యులు లేదా ఎంపీలు పార్టీని వీడితేనే సరిపోదని, మొత్తం పార్టీ మరో పార్టీలో విలీనం అయినప్పుడే చట్టం వర్తించదని టీఎంసీ వాదిస్తోంది. ఈ మేరకు 20 మంది తిరుగుబాటు ఎంపీలపై అభిషేక్ బెనర్జీ విడివిడిగా అనర్హత పిటిషన్లు సమర్పించారు. ఇదిలా ఉండగా, జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే వర్షాకాల సమావేశాలకు సంబంధించి లోక్‌సభలో సీటింగ్ ఏర్పాట్లపై కూడా కార్యదర్శిత్వం కసరత్తు చేస్తోంది. టీఎంసీ, శివసేన (యూబీటీ) తిరుగుబాటు వర్గాలతో పాటు డీఎంకే కూడా కాంగ్రెస్‌కు దూరంగా ప్రత్యేక సీటింగ్ కేటాయించాలని కోరినట్లు సమాచారం.

◆

అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార–పౌరసం బంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాల యంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో చేపట్టనున్న అఫోర్డబుల్ ఎల్ఐజీ అర్బన్ హౌసింగ్ పథకం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం పై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన లకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలిచింద న్నారు. అదే స్ఫూర్తితో క్యూర్ పరిధిలో చేపట్టనున్న అఫోర్డబుల్ ఎల్ఐజీ అర్బన్ హౌసింగ్ పథకాన్ని విజయవంతం చేయాలని అధికా రులను ఆదేశించా రు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందు లు తలెత్తకుండా, వారు ప్రస్తుతం నివసిస్తు న్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టే లా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

10 ఆర్డీవో.. 107 తహసీల్దార్ కార్యాలయాలు

రాష్ట్రవ్యాప్తంగా 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసీల్దార్ కార్యాలయాలు, స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన రెండు డీఐజీ కార్యాలయాలు, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. అన్ని భవనాలు ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తామని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సోలార్ పార్కింగ్ వంటి సౌకర్యాలను కూడా కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. సమీక్ష సమావేశంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

12 గంటలు.. 200 మి.మీ. వర్షం!

- ముంబైని ముంచెత్తిన వానలు
- జలమయమైన రహదారులు
- రైళ్లు, రోడ్డు రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నేడు కూడా భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరిక
- పాఠశాలలు, కళాశాలలకు సెలవు
- విక్రోలిలో అత్యధికంగా 260 మి.మీ. వర్షపాతం నమోదు

ముంబై/థాణే: మహారాష్ట్ర రాజధాని ముంబైని శనివారం భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో 12 గంటల్లోనే దాదాపు 200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నీటమునిగిపోవడం, చెట్లు, గోడలు కూలిపోవడం, రోడ్లు దెబ్బతినడం వంటి ఘటనలతో సాధారణ జనజీవనం తీవ్రంగా అస్తవ్యస్తమైంది. రోడ్డు, రైలు రాకపోకలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అతిభారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) శనివారం మధ్యాహ్నం పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించింది. ఆదివారం కూడా భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. బీఎంసీ వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తూర్పు శివారు ప్రాంతాల్లో సగటున 186 మి.మీ., పశ్చిమ శివార్లలో 168 మి.మీ., దక్షిణ ముంబైలో 129 మి.మీ. వర్షపాతం నమోదైంది. విక్రోలి పశ్చిమ ప్రాంతంలో అత్యధికంగా 260 మి.మీ. వర్షం కురవగా, పవాయ్, భాండుప్, మలాడ్, కాందివలి, జోగేశ్వరి, అంధేరి ప్రాంతాల్లో 210 మి.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది.

రహదారుల మూసివేత

భారీ వర్షాలు, సముద్రంలో ఆటుపోటు ప్రభావంతో నగరంలోని అనేక ప్రాంతాలు నీటమునిగాయి. అంధేరి సబ్‌వేను వాహనాల రాకపోకలకు మూసివేయగా, సాకీనాకా, చాందివలి, విలే పార్లే, చెంబూర్, విక్రోలి తదితర ప్రాంతాల్లో పలు రహదారులను పోలీసులు మూసివేశారు. వెస్ట్రన్ రైల్వేలో నలాసోపారా–విరార్ మధ్య పట్టాలపై నీరు చేరడంతో రైళ్లు 15–20 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి. మెయిన్, హార్బర్ లైన్లలోనూ సేవలకు అంతరాయం ఏర్పడింది. నగరంలో 64 చోట్ల చెట్లు కూలగా, ఎనిమిది ఇళ్లు లేదా గోడలు కూలిన ఘటనలు నమోదయ్యాయి. బైకుల్లాలో రెండు అంతస్తుల భవనం కూలి ఇద్దరు పురుషులు, ఓ మహిళ గాయపడ్డారు. భాండుప్‌లో నిర్మాణంలో ఉన్న ప్రాంతం వద్ద రోడ్డు కుంగిపోవడంతో ఓ వాహనం గుంతలో చిక్కుకుంది. అయితే ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు 10 వేల మందికి పైగా సిబ్బందిని రంగంలోకి దించినట్లు బీఎంసీ తెలిపింది. 448 డీ–వాటరింగ్ పంపులు, 19 మినీ పంపింగ్ స్టేషన్లు నిరంతరం పనిచేస్తున్నాయని వెల్లడించింది. వరద నీటి ద్వారా వ్యాపించే లెప్టోస్పిరోసిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

అవసరమైతే తప్ప బయటకు రావొద్దు: సీఎం ఫడ్నవీస్

ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంతో పాటు పుణె, నాసిక్ ప్రాంతాల్లో సోమవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక థాణే, పాల్ఘర్, నవి ముంబై, పుణెలోనూ వర్షాలు బీభత్సం సృష్టించాయి. పాల్ఘర్‌లో వరద నీటిలో కొట్టుకుపోయి ఆరేళ్ల బాలుడు మృతిచెందగా, నీట మునిగిన ప్రాంతాల నుంచి 180 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పుణెలో రోడ్లు జలమయమవడంతో పాటు కొండచరియలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

విమానాల దారి మళ్లింపు

భారీ వర్షాలతో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శనివారం ముంబైకి రావాల్సిన ఐదు విమానాలను సమీప విమానాశ్రయాలకు మళ్లించారు. వీటిలో మూడు ఇండిగో, రెండు ఎయిర్ ఇండియా విమానాలు ఉన్నాయని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. రాయ్‌పూర్–ముంబై (6ఈ 594), వారణాసి–ముంబై (6ఈ 6544), బెంగళూరు–ముంబై (6ఈ 6283) ఇండిగో విమానాల్లో రెండింటిని సూరత్‌కు, మరొకదాన్ని అహ్మదాబాద్‌కు మళ్లించారు. అలాగే ఢిల్లీ–ముంబై ఎయిర్ ఇండియా విమానం (ఏఐ 2963)ను సూరత్‌కు, చండీగఢ్–ముంబై విమానం (ఏఐ 472)ను గోవాలోని మనోహర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు.

బుల్లెట్ రైలు టన్నెల్ పనుల ప్రారంభోత్సవం వాయిదా

ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) జారీ చేసిన రెడ్, ఆరెంజ్ అలర్ట్‌ల నేపథ్యంలో ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో టన్నెల్ బోరింగ్ పనుల అధికారిక ప్రారంభోత్సవాన్ని కేంద్ర రైల్వే శాఖ వాయిదా వేసింది. అయితే ప్రాజెక్టు ఆలస్యం కాకుండా పనులను వెంటనే ప్రారంభించాలని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్)కు ఆదేశాలు జారీ చేసింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదివారం విక్రోలి నుంచి బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) వరకు భూగర్భ టన్నెల్ బోరింగ్ పనులను ప్రారంభించాల్సి ఉండగా, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కార్యక్రమాన్ని వాయిదా వేశారు. అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఆధ్వర్యంలో 20.37 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో 7 కిలోమీటర్ల మేర సముద్రగర్భంలో టన్నెల్ నిర్మించనున్నారు. టన్నెల్ సుమారు 65 మీటర్ల లోతులో ఉంటుంది. తొలి టన్నెల్ బోరింగ్ యంత్రం (టీబీఎం) విక్రోలి నుంచి బీకేసీ వైపు 5.8 కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపడుతుంది.

వేర్వేరు ఘటనల్లో నలుగురు గల్లంతు

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు విషాదాలకు దారితీస్తున్నాయి. నవి ముంబైలోని ఖార్ఘర్ ప్రాంతం లోని పాండవ్‌కడ జలపాతం, థాణే జిల్లా అంబర్‌నాథ్‌లోని చిక్లోలి డ్యామ్ వద్ద జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. తలోజాకు చెందిన మహ్మద్ మొబషిర్ మహ్మద్ షాహిద్ (20) శుక్రవారం పాండవ్‌కడ జలపాతం వద్ద బలమైన నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అదే ప్రాంతంలో శనివారం ముంబైకి చెందిన షానన్ గ్యాస్‌పర్ కిని (19) కూడా ప్రవాహంలో చిక్కుకుని అదృశ్యమయ్యా డు. ఈ ఇద్దరి ఆచూకీ ఇంకా లభించలేదని అధికారు లు తెలిపారు. మరో ఘటనలో అంబర్‌నాథ్‌లోని చిక్లోలి డ్యామ్‌కు ఈత కోసం వెళ్లిన విశ్వనాథ్ కాంబ్లే (22) నీటిలో గల్లంతయ్యాడు. రాత్రి వరకు గాలింపు కొనసాగించినప్పటికీ అతడిని గుర్తించలేకపోయారు. ఇదిలాఉంటే.. థాణే నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు భవనాలు, నిర్మాణాల భాగాలు కూలిపోయాయి. అంబేద్కర్ రోడ్డులోని 35 ఏళ్ల నాటి శాంతాబాయి గోటావాలే చాల్ మొదటి అంతస్తు బాల్కనీ కూలిపోవడంతో మిగిలిన భవనం ప్రమాదకరంగా మారింది. దీంతో అక్కడ నివసిస్తున్న కుటుంబాలను అధికారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే పింపల్‌పాడాలోని తథాగత గౌతమ బుద్ధ సొసైటీ సమీపంలో డ్రెయినేజీ గోడ కూలిపోవడంతో పక్కనే ఉన్న నాలుగు ఇళ్లను ఖాళీ చేయించి కుటుంబాలను బంధువుల ఇళ్లకు పంపించారు. నవి ముంబైలోని షహబాజ్ గ్రామంలోని అవిఘ్న సొసైటీలో కూడా మొదటి అంతస్తు బాల్కనీ కూలిన ఘటన చోటుచేసుకుంది. ఈ నిర్మాణ ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

రేవంత్‌రెడ్డి నిజమైన ప్రజా నాయకుడు

- పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారు
- ప్రజలకు కృతజ్ఞతలు చెప్పేందుకు రావడం
- ఆయన గొప్ప సంస్కారానికి నిదర్శనం
- మిడ్జిల్ సభలో ఉప ముఖ్యమంత్రి

ప్రజానావ నాగర్‌కర్నూల్ : తనను ఆదరించిన ప్రజల దీవెన పొందాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డిది పెద్ద మనసని డిప్యూటి సిఎం భట్టి విక్రామార్క అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదలను ఆదుకోవాలన్న ఆకాంక్ష రేవంత్ రెడ్డిలో ఉన్నాయని అన్నారు. రేవంత్‌ను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనలో ఉదాత్తమైన ఆశయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. వలం అధికారుల సలహాల పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆకలి లేని సమాజమే లక్ష్యంగా కోటి పదిహేను లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోందని భట్టి విక్రమార్క వివరించారు. . గత పాలకుల హయాంలో నిరంతరం భయంతో బతికిన తెలంగాణ ప్రజలకు, నేడు నిజమైన స్వేచ్ఛా స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించిన ధీశాలి రేవంత్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కొనియాడారు.

ఖమేనీకి అశ్రునివాళి

(మొదటిపేజీ తరువాయి)

అంత్యక్రియల సందర్భంగా ఇరాన్ ప్రధాన చర్చల ప్రతినిధి కాజెమ్ ఘరీబాబాది కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిలో సంయుక్త గస్తీ నిర్వహించాలన్న బ్రిటన్, ఫ్రాన్స్ ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హోర్ముజ్ భద్రత తీరప్రాంత దేశాల బాధ్యతేనని, బాహ్య జోక్యానికి తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

ట్రంప్‌కు వ్యతిరేక నినాదాలు

అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవం రోజునే అంత్యక్రియలు ప్రారంభం కావడం గమనార్హం. ఈ సందర్భంగా అంతిమయాత్రలో పాల్గొన్నవారు అమెరికాకు మృతి, ఇజ్రాయెల్‌కు మృతి అంటూ నినాదాలు చేశారు. కొందరు నిరసనకారులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న బ్యానర్లు కూడా ప్రదర్శించారు. ఇదిలాఉంటే ఖమేనీ పార్థివదేహాన్ని పలు నగరాల మీదుగా అంతిమయాత్రగా తీసుకెళ్లిన అనంతరం ఆయన జన్మస్థలం మష్హద్‌లోని ఇమామ్ రిజా పవిత్ర క్షేత్రంలో గురువారం ఖననం చేయనున్నారు. ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు, సోమవారం టెహ్రాన్ వీధుల్లో భారీ అంతిమయాత్ర నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా రహదారులు, గగనతలం, ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రత్యేక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి.

కవితకు ఎన్నికల సంఘం షాక్

- టీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్
- అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
- అవసరమైతే సుప్రీంను ఆశ్రయిస్తామని వెల్లడి

TRS
తెలంగాణ రక్షణ సేన
TELANGANA RAKSHANA SENA

ప్రజానావ, హైదరాబాద్ : కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటాని సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటి పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తి లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటి 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి డా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి సీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

మిడ్జిల్‌లో నాటిన మొక్క.. మహా వృక్షమైంది

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. నేరెళ్లలో ఇసుక దోపిడీని అడ్డుకు న్న దళితులపై లారీలతో దాడులు జరిగాయని ఆరోపించిన ఆయన, గత పదేళ్లలో ఒకే కుటుంబానికి తప్ప మరెవరికీ ఉద్యో గాలు, పదవులు దక్కలేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ కుటుంబ పాల న, దోపిడీకి అవకాశం కల్పించాలా అని ప్రజలను ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందని ప్రశ్నించిన సీఎం, కేటీఆర్, కవిత, హరీశ్‌రావులకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

మిడ్జిల్ ఇకపై డార్క్ మండలం కాదు

మిడ్జిల్ ఇకపై డార్క్ మండలం కాదని, అభివృద్ధికి ప్రతీకగా నిలిచే వెలుగు రేఖగా మారాలని ఆకాంక్షించారు. 2006లో తనపై జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వంలో తగిన పదవి కల్పిస్తామని ప్రకటించారు. తాను పేదల మధ్య పెరిగిన వ్యక్తినని, వారి కష్టాలు, సమస్యలు బాగా తెలుసని పే ర్కొన్నారు. గ్రామాల సమస్యల పరిష్కారమే రాష్ట్ర, దేశ అభివృ ద్ధికి పునాదిగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఎన్నికల వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం

- ఓటరు జాబితాల కచ్చితత్వాన్ని పెంచిన ప్రత్యేక సవరణ కార్యక్రమం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు.. అనర్హుల పేర్ల తొలగింపే లక్ష్యమని స్పష్టం

ఇందోర్: భారత్ ఎన్నికల వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత పారదర్శకమైన, విశ్వసనీయమైన వ్యవస్థల్లో ఒకటని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో ఓటరు జాబితాలు మరింత ఖచ్చితత్వం, విశ్వసనీయతను సంతరించుకున్నాయ ని పేర్కొన్నారు. ఇందోర్‌లో శనివారం బూత్ స్థాయి అధికారులతో (బీఎల్ఓలు) నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు, వెనుకబడిన వర్గాల ప్రజలు సహా అర్హులైన ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అలాగే అనర్హుల పేర్లు ఓటరు జాబితాల్లో లేకుండా చూడడ మే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా గైర్హాజరైనవారు, మరణించినవారు, ఇతర ప్రాంతాలకు మారినవారు, డూప్లికేట్ నమోదులు, అనర్హుల పేర్లను గుర్తించి జాబితాలను మరింత ప్రామాణికంగా తీర్చిదిద్దామని వివరించారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం ఓటరు జాబితాల ప్రక్షాళన ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యత అని స్పష్టం చేశారు.

ఇంటర్నేషనల్ ఐడియాకు భారత్ అధ్యక్షత

ప్రపంచంలోని ప్రముఖ ప్రజాస్వామ్య దేశాల అంతర్ ప్రభుత్వ సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఇంటర్నేషనల్ ఐడియా)కు ప్రస్తుతం భారత్ అధ్యక్షత వహిస్తోందని గుర్తు చేశారు. భారత్‌లో ఓటు వేయడం స్వచ్ఛందమైనప్పటికీ, తప్పనిసరి ఓటింగ్ అమలులో ఉన్న అనేక దేశాల కంటే ఇక్కడ పోలింగ్ శాతం ఎక్కువగా ఉండటం ప్రజాస్వా మ్యంపై ప్రజల విశ్వాసాన్ని చాటుతోందని జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. బీఎల్‌ఓలను ప్రజాస్వామ్యానికి నిజమైన కాపలాదా రులుగా అభివర్ణించిన ఆయన, మారుమూల గిరిజ న, అటవీ ప్రాంతాల్లోనూ వారు సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. మధ్యప్రదేశ్‌లో ఎస్ఐఆర్ అమలైన తీరు దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆ రాష్ట్రం పారదర్శకంగా, క్రమబద్ధంగా ఈ ప్రక్రియను నిర్వహించిందని కొనియాడారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సంజీవ్ కుమార్ ఝా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భట్టిది గోబెల్స్ ప్రచారం

- రాష్ట్ర అప్పులపై తప్పుడు లెక్కలు చెబుతున్నారు
- రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీశ్‌రావు

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్ర అప్పుల విషయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని భట్టి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని వీడే సమయానికి రాష్ట్ర మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లే ఉందని స్పష్టం చేశారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవని, వాస్తవాలను వక్రీకరించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై భట్టి విక్రమార్క అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న పరిపాలనా వైఫల్యాలు, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి నుంచి బయటపడేందుకు కొత్త కథనాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు అనేక హామీలు ఇచ్చి, గ్యారంటీ కార్డులు పంచి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు వాటిని అమలు చేయలేక సాకులు చెబుతున్నారని అన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అసత్య ప్రచారం

బీఆర్ఎస్ హయాంలో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలు ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎక్కడా నిలిపివేయలేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హామీల అమలులో విఫలమై, ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర అప్పులపై అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తరహా రాజకీయ ఎత్తుగడలకు పాల్పడుతోందని హరీశ్‌రావు విమర్శించారు. కోపంతో విమర్శలు చేసినంత మాత్రాన వాస్తవాలు మారవని, ప్రజలు నిజానిజాలను గుర్తిస్తారని అన్నారు.

Jul 4, 2026 11:00:38 AM

డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- **తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు**
- **డ్రగ్స్, గంజాయి క్రయ, విక్రయాల సమాచారం పోలీసులకు అందించాలి**

ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, క్రయ, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పోలీసు అధికారులు తెలిపారు. శనివారం ఆర్ఐ (అడ్మిన్) ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం సహాయంతో తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కిరాణా షాప్, పాన్ షాప్స్, విద్యాసంస్థల పరిసరప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, బస్టాండ్‌లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొంటూ, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు

- **పబ్బతి ఆంజనేయస్వామి సన్నిధిలో సీఎం ప్రత్యేక పూజలు**
- **ఊరుకొండపేటలో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **నాటి సహచరులతో ఆత్మీయంగా గడిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ప్రజానావ, నాగర్‌కర్నూల్: రాజకీయ ప్రస్థానంలో మిడ్జిల్ మండల జడ్పీటీసీగా ఎన్నికై 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం ఊరుకొండపేటలోని శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేవంత్ రెడ్డి 2006 జూలై 4న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మిడ్జిల్ మండలం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీగా ఎన్నికై రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి కొడంగల్ ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి మల్కాజ్‌గిరి ఎంపీగా జాతీయ రాజకీయాల్లో గుర్తింపు పొందారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయతీరాలకు చేర్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తన రాజకీయ ప్రస్థానానికి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నాడు తన విజయానికి సహకరించిన నాయకులు, ప్రజలను కలిసి ఆత్మీయంగా గడపాలనే ఉద్దేశంతో మిడ్జిల్ మండల పర్యటన చేపట్టారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం హెలికాప్టర్‌లో రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో ఊరుకొండపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం అనంతరం సీఎం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సీఎం రాకతో ఊరుకొండపేటలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నాటి జడ్పీటీసీ ఎన్నికల్లో తనకు సహకరించిన నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు దిగారు. కొందరు అప్పట్లో ఆయనతో దిగిన పాత ఫొటోలను చూపించగా వాటిని చూసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఊరుకొండపేట నుంచి మిడ్జిల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య మంత్రి రోడ్డు మార్గంలో బయలుదేరారు. వీడ్కోలు సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ముఖ్యమంత్రికి ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.

పూర్తి చేసిన ఫారాలను వెంటనే సబ్మిట్ చేయాలి

- **గడువు చివరలో ఒత్తిడి పెరిగి సర్వర్లు పనిచేయక పోవచ్చు**
- **ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏ ఒక్కరి అర్హుల ఓటు పోదు, అనర్హుల ఓటు జాబితాలో చేరదు**
- **జూలై 24 అర్ధరాత్రి నుండి ఫారాలు ఆన్లైన్ స్వీకరించదు**
- **ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజానావతో సిరిసిల్ల ఆర్డీవో డా. డీ శ్రీధర్ బాబు**

ప్రజానావ, సిరిసిల్ల : అర్హులైన వారి ఏ ఒక్కరి ఓటు కూడా పోదని, అనర్హుల ఓట్లు ఒక్కటి కూడా జాబితాలో ఉండదని సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారి డా. డి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రజల్లో ఉత్పన్నమవుతున్న గందరగోల సమస్యలు, అనుమానాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ (స్పెషల్ టెలివిజన్ రివిజన్) ప్రక్రియపై ప్రజానావకు ఆర్డిఓ వివరాలు వెల్లడించారు. డివిజన్‌లో 2,46,563 ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 99 శాతం ఎన్యు మరేషన్ ఫారాలను పంపిణీ చేశామన్నారు. ఎస్ఐఆర్ నిరంతర ప్రక్రియ అని, 2002 సంవత్సరం ఓటర్ జాబితాను ప్రామాణికంగా తీసుకొని 2026 ప్రక్రియ సాగుతున్నదన్నారు. దీని వల్ల అక్రమంగా ఇతర దేశాల చోరబాటుదారులు, డబుల్ ఓటర్స్, మృతి చెందిన ఓటర్ల జాబితా నుండి తొలగిపోతారన్నారు. ఈ ప్రక్రియపై అవగాహన లేక భయానికి, గందరగోళానికి లోనవుతున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియ వల్ల నిజమైన, అర్హులైన ఓటర్ల జాబితా తయారవుతుందన్నారు. ఓటర్లు డోర్ లాక్, ప్రయాణాలు, తీర్థయాత్రలు, పర్మనెంట్ షిఫ్టింగ్ అయినవారు తదితర కారణాలవల్ల నివాసాలలో లేని వారికి మాత్రమే ఫారాలు అందకపోవచ్చు అన్నారు.

రెండు చోట్ల ఫారాలు సమర్పించే అవకాశం లేదు

రెండు చోట్ల ఓటరుగా ఉంటే మొదటి సారి ఫారాలు సబ్మిట్ చేసిన చోటే ఓటు ఉంటుందని, మరో చోట ఉన్న ఓటు తొలిగిపోతుందన్నారు. దీనితో రెండు చోట్ల ఓటు (డబుల్ ఓటు) ఉండే పరిస్థితి ఉండదన్నారు. ఒకవేళ మరో చోట రెండోసారి ఫారాలు సమర్పించిన వాటిని వెబ్సైట్ స్వీకరించదన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు త్వరగా నింపి త్వరగా సబ్మిట్ చేస్తే సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఓటర్లకు సందేహాలు తొలగిపోవడానికి హెల్ప్ లైన్ నెంబర్ 92902 91666 ఏర్పాటు చేశామన్నారు.

జూలై 31 నాటికి ఓటర్ల జాబితా ప్రకటన

జూలై 31 నాటికి ఓటర్ల జాబితా ప్రకటిస్తారన్నారు. ఓటర్ల జాబితా లో ఏదైనా సవరణలు, క్లైములు ఉంటే జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు వాటిపై సవరించుకునే అవకాశం (అప్పీలు) ఉంటుందన్నారు. ఓటరు పేరు నమోదు కాకున్నా క్లెమ్ చేసుకోవచ్చని తెలిపారు. ఫైనల్ తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 1వ తేదీన ప్రకటిస్తారని తెలిపారు.

11 రకాల ఐడి ప్రూఫ్‌లలో ఒక ప్రూఫ్ చూపాలి

01–07–1987వ తేదీకి ముందు జన్మించిన వారు 11 రకాల ధ్రువపత్రాలలో ఏదైనా ఒక పత్రం చూపించి నమోదు చేసుకోవచ్చన్నారు. 01– 07–1987 వ తేదీ నుండి 02–12– 2004వ తేదీ మధ్య జన్మించిన వారు తన డాక్యుమెంట్, తల్లి లేదా తండ్రికి సంబంధించిన ఒక ధృవపత్రము (ఐడి ప్రూఫ్) సమర్పించి ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. 02–12– 2004వ తేదీ తర్వాత అతని ధ్రువ పత్రము అలాగే తల్లిదండ్రులది ఇద్దరి ఐడి ప్రూఫ్ చూపించాలని అన్నారు. రాజకీయ పార్టీల బిఎల్ఏలు సహకరిస్తే త్వరగా ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి కాగలదని ఆర్డీవో శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

పూరించిన ఫారాలు బీఎల్వోలకు అందజేయాలి

ఫారాలు పూర్తి చేసిన వారు వీలైనంత త్వరగా వెంట వెంట బిఎల్ఓ లకు ఇచ్చే ప్రయత్నం చేయాలన్నారు. జూలై 24 వ తేదీ అర్ధరాత్రి నుండి ఆన్లైన్ వెబ్ క్లోజ్ అవుతుందని, తరువాత ఫారాలు వెబ్సైట్ తీసుకోదని తెలిపారు. అలాగే గడువు ముగిసే సమయం దగ్గరికి వస్తున్నప్పటికీ సర్వర్లు బిజీ అవుతాయని అందరూ గడువు చివరలో ఒకేసారి ఇవ్వడం వల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని ఆర్డీవో వెల్లడించారు. అందుకే ఈనెల 20వ తేదీలోగా పూర్తిచేసిన ఎన్యుమరేషన్ ఫారాలు అందించే ప్రక్రియ పూర్తిచేసే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు.

నిద్రమత్తు వీడని ఫుడ్ సేఫ్టీ అధికారులు

- **మీడియా సమావేశంలో సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్**

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా లో వరుస ఆహార కల్తీ సంఘటనలు జరుగుతున్న నిద్రమత్తులో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారని సిపిఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ ఆరోపించారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని అమృత లాల్ శుక్ల కార్మిక భవన్లో రాజశేఖర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా సిరిసిల్ల పట్టణం లో పుట్ట గొడుగుల్లా హోటళ్ళు, రెస్టారెంట్లు ఏర్పాటు అవుతున్నాయని, నాసిరకం వంట నూనెల వినియోగంతో రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని, అయినా ఎక్కడ కూడా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. అలాగే జిల్లాలో ఏదైనా ఫిర్యాదు చేస్తేనే అధికారులు కంటి తుడుపు చర్యలు తీసుకోక పోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. ముఖ్యంగా సిరిసిల్ల పట్టణంలో బాలాజీ స్వీట్ హౌస్ నిబంధనలకు విరుద్ధంగా స్వీట్ తయారీ పరిశ్రమ జనావాసాలలో పెట్టడం తయారీ కేంద్రంలో నియమ నిబంధనలు పాటించకపోవడం, అయినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నరని ఆరోపించారు. కల్తీ ఆహారం తిని ప్రజలు ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారో ఫుడ్ సేఫ్టీ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బడా హోటల్లు, సూపర్ మార్కెట్లో రెస్టారెంట్ కిరాణా దుకాణాల్లో కల్తీ సరుకులు తినుబండారాల వ్యాపారులపై నిత్యం తనిఖీలు జరపాల్సిన అధికారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప నిర్వహించకపోవడంతో జిల్లాలో అధికారులు ఉన్నారా లేరా అని అనుమానాలు వస్తున్నాయని, ఇప్పటికైనా నియమ నిబంధనలను పాటించని హోటళ్లు రెస్టారెంట్లు పైన ప్రత్యేక తనిఖీలు చేయాలని నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు దాసరి రూప, సూరం పద్మ, సందుపట్ల పోచమ్మల్లు తదితరులు పాల్గొన్నారు

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- **రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం త్వరలో ప్రారంభం**

ప్రజానావ, గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలోని గురుకుల పాఠశాల పక్కన 26 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. శనివారం రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ నరేశ్, ఎంవీఆర్ కన్స్ట్రక్షన్స్ సీఈవో విజయ్ కుమార్, సీనియర్ ఇంజినీర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి నిర్మాణ ప్రణాళికలను వివరించారు. అనంతరం శనివారం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అధికారులతో కలిసి స్కూల్ నిర్మాణం చేపట్టనున్న స్థలాన్ని పరిశీలించి, పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధునిక సౌకర్యాలతో ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో విశాలమైన తరగతి గదులు, అత్యాధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, బాలురు–బాలికలకు ప్రత్యేక సీనియర్, జూనియర్ హాస్టళ్లు, సిబ్బంది నివాస గృహాలు, పేరెంట్స్ వెయిటింగ్ హాల్స్‌తో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులను త్వరలోనే ప్రారంభించి 18 నెలల్లో పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థ ద్వారా రామగుండం నియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ వసతి, శిక్షణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అదేవిధంగా, ఎన్టీపీసీ సంస్థ తన సీఎస్ఆర్ నిధులను రామగుండం నియోజకవర్గ పరిధిలోనే ఖర్చు చేసి, ఈ ప్రాంత విద్య, మౌలిక వసతులు మరియు అభివృద్ధి కార్యక్రమాలకు మరింత సహకారం అందించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ అమలు

- **పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **ప్రతి నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, పాఠశాలల సమీక్షలు నిర్వహించాలి**
- **అభ్యాసన ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి**

ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యా ప్రమాణాల పెంపునకు పటిష్టమైన కార్యాచరణను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం నిర్వహించిన ప్రాథమిక ఉపాధ్యాయుల డీఆర్‌పీ బృందం సమీక్ష సమావేశంలో, గత సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా ప్రాథమిక స్థాయి విద్యార్థుల తరగతి వారీ అభ్యాస సామర్థ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన వార్షిక విద్యా ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతి నెల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, పాఠశాల స్థాయి సమీక్షలను క్రమం తప్పకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లెటరసీ అండ్ నమరసీ) కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థుల నమోదు అధికంగా ఉన్న ఐదు ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను ప్రతి నెల సమీక్షిస్తూ, అవసరమైన మెరుగుదల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపిక చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి, విద్యా ప్రమాణాల పెంపు, సమర్థవంతమైన బోధన, అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రూపొందించిన వార్షిక విద్యా ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థి అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి శారద, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) షేక్, అలోకిట్ పర్యవేక్షకులు, ప్రాథమిక స్థాయి డీఆర్‌పీ బృందం పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.1,41,000 విరాళం అందజేత

ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి మరియు విస్తరణ పనుల కోసం భారీ విరాళం అందింది. అమెరికాలో స్థిరపడిన వరంగల్ వాస్తవ్యులు శ్రీ జాట్లింగ్ కిరణ్ కుమార్ – శ్రీమతి లక్ష్మి లావణ్య దంపతులు స్వామివారి ఆలయానికి రూ. 1,41,000 (అక్షరాలా ఒక లక్షా నలభై ఒక్క వేల రూపాయలు) నగదును విరాళంగా అందజేశారు. శనివారం ఆలయానికి చేరుకున్న దంపతులు రాజన్నను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి గారికి ఈ విరాళానికి సంబంధించిన నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం అందించి, లడ్డూ ప్రసాదాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికులకు ఇబ్బందులు

- **మిడ్జిల్ బహిరంగ సభ కోసం భారీగా బస్సుల కేటాయింపు**
- **గ్రామీణ సర్వీసుల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం**

ప్రజానావ, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రజా ప్రతినిధిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభకు మహిళలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను భారీ సంఖ్యలో అద్దెకు తీసుకున్నారు. దీంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి ఆర్టీసీ డిపోల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులను సభకు కేటాయించారు. ఈ కారణంగా శనివారం ఉదయం నుంచే గ్రామీణ ప్రాంతాలకు నడిచే పలు ఆర్టీసీ సర్వీసులతో పాటు ఆయా ప్రాంతాల్లో నడిచే షటిల్ సర్వీసులను రద్దు చేశారు. అంతేకాకుండా హైదరాబాద్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట, కల్వకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్యను కూడా తగ్గించారు. దీంతో వివిధ మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సులు లేకపోవడం, ఇతర మార్గాల్లో కూడా సర్వీసులు తగ్గిపోవడంతో ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. మిడ్జిల్‌లో జరుగుతున్న ముఖ్యమంత్రి సభకు బస్సులు వెళ్లిన కారణంగా పలు సర్వీసులు రద్దయ్యాయని, అందుబాటులో ఉన్న బస్సుల్లోనే ప్రయాణించాలని కంట్రోలర్లు ముందస్తు ప్రకటనలు చేస్తూ ప్రయాణికులను అప్రమత్తం చేశారు. అయితే ఒక్కసారిగా అందుబాటులో ఉన్న బస్సుల్లో ప్రయాణికులు ఎక్కేందుకు ప్రయత్నించడంతో బస్సుల వద్ద రద్దీ నెలకొంది. ఇదే సమయంలో శుభకార్యాలు, ఆలయ దర్శనాల కోసం బయలుదేరిన పలువురు ప్రయాణికులు బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితి తెలుసుకున్న కొందరు ప్రత్యామ్నాయ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రయత్నించారు. గ్రామీణ ప్రాంతాలకు నడిచే షటిల్ సర్వీసులను ఆకస్మికంగా రద్దు చేయడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం రెండు రోజుల ముందే బస్సుల రద్దుపై సమాచారం ఇచ్చి ఉంటే ప్రయాణాలను వాయిదా వేసుకునే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రకటనలు చేయాలని కోరుతున్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు,
నియోజకవర్గ కేంద్రాలు,
మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
☎ 9948433277, 9014966169



EDITORIAL

సర్ పక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి

> రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి డా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సవూక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు.

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి డా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సవూక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది డా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ డా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని ంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేవూ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, ంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందు ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలు సిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, రళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు డా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం డా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రావుణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒ ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినపుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ ద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతాని మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం డా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచూ సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం.

> ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతాని మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం డా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు.

మానవత్వానికి ప్రతీక శ్రీ సత్యసాయి సంజీవని

- 500వ గుండె శస్త్రచికిత్స పూర్తి సందర్భంగా భావోద్వేగంగా మాట్లాడిన హరీష్‌రావు
- ఏడాది వేతనాన్ని ట్రస్ట్‌కు విరాళంగా ప్రకటించిన విజయ్ దేవరకొండ సేవాభావాన్ని ప్రశంసించిన ఎమ్మెల్యే

SANJEEVANI HOSPITAL
MOTHER & CHILD HOSPITAL
RESEARCH FOUNDATION
ELOPMENT INSTITUTE

ప్రజానావ, సిద్ధిపేట : కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రి వేలాది చిన్నారులకు పునర్జన్మనిస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన 'గిఫ్ట్ ఆఫ్ లైఫ్' కార్యక్రమంలో సినీ హీరో విజయ్ దేవరకొండతో కలిసి పాల్గొన్న ఆయన, 500వ ఉచిత గుండె శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైన సందర్భంగా వైద్య బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా తన ఏడాది ఎమ్మెల్యే వేతనాన్ని సత్యసాయి సంజీవని ట్రస్ట్‌కు విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. సత్యసాయి సంజీవని కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా మారిన దేవాలయమని పేర్కొన్నారు. పుట్టుకతోనే గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్యం అందించి కొత్త జీవితాన్ని ప్రసాదించడం అసాధారణ సేవ అని కొనియాడారు. ఈ ఆసుపత్రి ఒక చిన్నారి గుండెను మాత్రమే కాదు, మూడు గుండెలను కాపాడుతోందని, ఒకటి చిన్నారి గుండె, రెండోది తల్లి గుండె, మూడోది తండ్రి గుండె అని భావోద్వేగంగా చెప్పారు. బిడ్డ ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వెళ్లినప్పుడు ఆ కుటుంబమంతా కొత్త ఆశతో జీవితం ప్రారంభిస్తుందని అన్నారు.డాక్టర్ శ్రీనివాస్‌ను ఉద్దేశిస్తూ, దేవాలయంలో కనిపించని దేవుడిని ప్రార్థిస్తామని, కానీ ప్రతి సంవత్సరం వేలాది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న డాక్టర్ శ్రీనివాస్ మాత్రం కనిపించే దేవుడని అభివర్ణించారు. తన సంపాదనను ఖర్చు చేస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించడం మహోన్నతమని కొనియాడారు. ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది చూపుతున్న అంకితభావం, ప్రేమ, సహనం, పరిశుభ్రత, రోగుల పట్ల ఆప్యాయత ఎంతో గొప్పవని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలు ఈ సేవలను ప్రశంసించడం సంస్థ గొప్పతనానికి నిదర్శనమన్నారు. మనిషి జీవితంలో పదవులు, సంపద కంటే చేసిన సేవే శాశ్వతంగా నిలిచిపోతుందని, ప్రతి ఒక్కరూ తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండను ప్రత్యేకంగా అభినందించిన హరీష్‌రావు, విజయం సాధించిన తర్వాత చాలామందిలో గర్వం కనిపిస్తుందని, కానీ విజయ్‌లో మాత్రం వినయం కనిపిస్తోందన్నారు. కరోనా సమయంలో వేలాది మందికి సాయం చేయడంతో పాటు తన తండ్రి పేరుతో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారని ప్రశంసించారు. మతం, ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా ప్రతి చిన్నారికి సమాన ప్రేమతో వైద్యం అందించడం సత్యసాయి సంజీవని ప్రత్యేకత అని పేర్కొన్నారు. 500వ గుండె శస్త్రచికిత్స పూర్తి కావడం ఆసుపత్రి చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిందని, వైద్యులు, నర్సులు, సిబ్బంది, సేవా కార్యక్రమంలో భాగమైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

సిద్దిపేట కా షేర్ హరీష్ రావు : విజయ్ దేవరకొండ

సిద్ధిపేట ప్రతినిధి: మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుపై ప్రముఖ సినీ హీరో విజయ్ దేవరకొండ ప్రశంసల జల్లు కురిపించారు. హరీష్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు వేలాది చిన్నారులకు కొత్త జీవితం లభిస్తోందని పేర్కొన్నారు. హరీష్‌రావు సహకారం లేకపోయి ఉంటే శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకునేది కాదన్ని, అందుకే ఆయనను సిద్ధిపేట కా షేర్ హరీష్ అన్న అని అభివర్ణించారు. సిద్ధిపేట జిల్లా కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రి లో నిర్వహించిన గిఫ్ట్ ఆఫ్ లైఫ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, తాను ఈ కార్యక్రమానికి రావ డానికి ప్రధాన కారణం హరీష్‌రావేనని చెప్పారు. హరీష్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆసుపత్రికి భూమి కేటాయింపు, అవసరమైన పరికరాల సమకూర్పు వంటి అంశాల్లో ఎంతో సహకారం అందించారని తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ పేదల కోసం చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని కొనియాడిన ఆయన, అలాంటి సేవా కార్యక్రమాలకు హరీష్‌రావు అండగా నిలవడంతో ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందిందన్నారు. నేడు వేలాది చిన్నారులకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ వారి ప్రాణాలను కాపాడటం ఆనందంగా ఉందని చెప్పారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

ప్రజానావ, సూర్యాపేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి విశాల్ ఉప్పల, గొర్రెలు–మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, కంచకట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మన్యం యాదగిరి, దున్న శ్యామ్, టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు భూమి అక్రమ నమోదుపై చర్యలు

- భూభారతి ఆపరేటర్ జైపాల్ తొలగింపు
- క్రిమినల్ కేసు నమోదు ఆదేశాలు
- డిప్యూటీ తహసీల్దార్ అశోక్ కుమార్ సస్పెన్షన్
- కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్

ప్రజానావ, నాగర్‌కర్నూల్: జిల్లాలోని అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన రైతు జంచుక మసన్న జీవించి ఉండగానే ఆయన మరణించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి, రైతుకు తెలియకుండా ఆయన పట్టా భూమిని ప్రభుత్వ అసైన్డ్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసిన ఘటనను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ తీవ్రంగా పరిగణించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయి విచారణ చేపట్టిన కలెక్టర్, విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణలో అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న మూడవ జైపాల్ విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలడంతో ఆయనను తక్షణమే విధుల నుంచి తొలగించారు. అదేవిధంగా ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అచ్చంపేట ఆర్డీవోను ఆదేశించారు. ఇక ఘటన జరిగిన సమయంలో అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యుటేషన్ పై పనిచేస్తున్న ఏ. అశోక్ కుమార్‌పై కూడా విచారణలో తీవ్ర నిర్లక్ష్యం నిర్ధారణ కావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ భూభారతి నిబంధనలు–2025 ప్రకారం వారసత్వ మార్పిడి కేసుల్లో దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించి చట్టబద్ధంగా ధ్రువీకరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. అయితే సమర్పించిన పత్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించకుండా తగిన ధ్రువీకరణ లేకుండానే వారసత్వ మార్పిడి ప్రక్రియ పూర్తి చేయడం ద్వారా నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే జీవించి ఉన్న రైతును మృతుడిగా చూపిస్తూ రికార్డుల్లో మార్పులు జరిగాయని, ఫలితంగా రైతు పట్టాదారు భూమి ప్రభుత్వ అసైన్డ్ భూమిగా నమోదు కావడం ద్వారా రైతు హక్కులకు తీవ్ర భంగం కలిగిందని వెల్లడించారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ నిబంధనలు–1991లోని రూల్–8 ప్రకారం ఏ. అశోక్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో నిబంధనల ప్రకారం ప్రాథమిక వేతనం, అలవెన్సుల్లో 50 శాతం జీవన భృతి చెల్లించనున్నట్లు వెల్లడించారు. విచారణ పూర్తయ్యే వరకు నాగర్‌కర్నూల్‌ను ప్రధాన కేంద్రంగా నిర్ణయించి, జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. రైతుల భూ హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, నిబంధనల అమలు తప్పనిసరి అని, నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

సత్తుపల్లిలో భారీగా గంజాయి పట్టివేత

- రూ.89 లక్షల విలువైన 166 కేజీలు స్వాధీనం
- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా యత్నం
- కారు డ్రైవర్ అరెస్ట్.. ఇద్దరు నిందితులు పరారీ

ప్రజానావ, ఖమ్మం: ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయిని తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో శనివారం ఈగల్ బృందం, పోలీసు సిబ్బంది సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సత్తుపల్లి వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న టయోటా ఎటియోస్ కారును ఆపి తనిఖీ చేయగా, అందులో నిగూఢంగా దాచిన 166 కిలోల 360 గ్రాముల గంజాయి లభ్యమైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.89.13 లక్షలు ఉంటుందని సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీహరి తెలిపారు. గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్, రూ.500 నగదు, రవాణాకు వినియోగించిన ఏపీ–39–ఏటీ–8240 నంబర్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడిన ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన కారు డ్రైవర్ ప్రబిన్ భాత్రా (31)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఒడిశాకు చెందిన బికారి అలియాస్ రోహన్ అనే వ్యక్తి ఆరు ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న 80 బ్రౌన్ టేప్‌తో చుట్టిన గంజాయి ప్యాకెట్లను హైదరాబాద్‌లో ఒక వ్యక్తికి అందజేయాలని తనకు అప్పగించినట్లు నిందితుడు అంగీకరించాడు. పని పూర్తయితే రూ.10 వేల పారితోషికం ఇస్తామని చెప్పడంతో దారకొండ జంక్షన్ నుంచి రాజమండ్రి మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గంలో ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపాడు. అయితే మార్గమధ్యంలో పోలీసు తనిఖీల భయంతో వేంసూర్ వద్ద హైవే దిగి సత్తుపల్లిలో భోజనం చేసి హైదరాబాద్ వెళ్లాలని మార్గం మార్చుకున్న సమయంలో పోలీసులు ఖచ్చితమైన సమాచారంతో పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుడిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏ–2 నిందితుడైన బికారి అలియాస్ రోహన్, ఏ–3 నిందితుడైన కర్నూలు జిల్లా బేతంచర్లకు చెందిన చుక్క నాగేశ్వరరావు గౌడ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. గంజాయి కొనుగోలు, విక్రయం, వినియోగం వంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు హెచ్చరించారు. ఈ దర్యాప్తులో ఎస్సై వీర ప్రసాద్, ఎస్సై ప్రదీప్, ఈగల్ టీమ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి స్వరాల్లో మార్మోగిన భద్రగిరి శతకం

ఘనంగా ఆడియో సీడీ ఆవిష్కరణ

ప్రజానావ, భద్రాచలం: కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన ప్రసిద్ధ భద్రగిరి శతకం ఆడియో సీడీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా భద్రగిరి శతకం ఆడియో రికార్డు ప్రతిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త గరికపాటి రామమూర్తితో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, అదనపు కమిషనర్లు శ్రీనివాస్, కృష్ణవేణి, వేద పండితులు పాల్గొన్నారు. అనంతరం ఆవిష్కరించిన భద్రగిరి శతకం ఆడియో రికార్డును శనివారం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్ కుమార్, దేవస్థాన పర్యవేక్షకులు ఎల్. సాయిబాబా, ఏ. శ్రీనివాస్ రెడ్డి, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

సర్‌లో పొరపాట్లకు తావివ్వొద్దు

ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణను పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ బడుగు చంద్రశేఖర్

ప్రజానావ, మిర్యాలగూడ: ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–సర్) ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి బడుగు చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మిర్యాల్గూడ పట్టణంలోని 3వ వార్డు పరిధిలో శనివారం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల్లో 2002 ఓటరు జాబితా ఆధారంగా నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించడంతో పాటు బీఎల్‌ఓల వద్ద ఉన్న ఫారం–6, ఫారం–7, ఫారం–8లను తనిఖీ చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేసి సహకరించాలని సూచించారు. సర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకున్న వారు తిరిగి అందజేస్తున్నారా లేదా అనే అంశంపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ పరిశీలనలో మిర్యాలగూడ తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అరుణోదయ నాగన్న మృతి బాధాకరం

సంతాపం తెలిపిన ఎంపీ వద్దిరాజు

ప్రజానావ, ఖమ్మం: ప్రముఖ గాయకుడు, కవి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పరకాల నాగయ్య (నాగన్న) మృతి పట్ల బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గత సుమారు ఐదు దశాబ్దాలుగా నాగన్న విప్లవోద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, బడుగు బలహీన వర్గాలపై జరిగే దాడులు, అన్యాయాలను తన కలం, గళం ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజల్లో చైతన్యం నింపారని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. నాగన్న మృతి విప్లవోద్యమానికి, సాంస్కృతిక రంగానికి, బహుజన సమాజానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నూతన వధూవరులకు ఆశీర్వదించిన ఎంపీ వద్దిరాజు

బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన పెద్దన్న వద్దిరాజు కిషన్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమరావు, సంఘం ప్రముఖులు మెట్టు శ్రీనివాస్, రమేష్ హజారీ తదితరులతో కలిసి నూతన వధూవరులు శ్రీవాణి–అభినవ్ రెడ్డిలకు ఆశీస్సులు అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త కూసం శ్రీనివాసులు కుమార్తె శ్రీవాణి వివాహం హైదరాబాద్‌కు చెందిన శీలం కన్నారెడ్డి–నిర్మల దంపతుల కుమారుడు అభినవ్ రెడ్డితో వరంగల్ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది.

ఈ వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు నూతన దంపతులను ఆశీర్వదించి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్టేడియం అభివృద్ధికి కొత్త ఊపు

ప్రజానావ, రామగుండం : రామగుండం–1 ఏరియా పరిధిలోని గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై శనివారం రిటైర్డ్ స్పోర్ట్స్ ఆఫీసర్ రాజ్ కొమురయ్య, సింగరేణి కాలరీస్ సంస్థ ప్రతినిధులు, రిటైర్డ్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రాజనారాయణ రెడ్డి స్టేడియాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని మౌలిక సదుపాయాలు, క్రీడాకారులు, పాదచారులకు అవసరమైన సౌకర్యాలను సమీక్షించారు. ముఖ్యంగా పాదచారులు నడిచేందుకు ప్రత్యేక వాకింగ్ ట్రాక్ ఏర్పాటు అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా రామగుండం–1 ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ మాట్లాడుతూ, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అభివృద్ధిలో భాగంగా సింథటిక్ వాకింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్టుకు ఫెన్సింగ్, గ్రౌండ్‌లో గడ్డి పెంపకం తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్టేడియాన్ని ఆధునిక క్రీడా వేదికగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు కూడా లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీజీఎం (సివిల్) వరప్రసాద్, సీనియర్ పీఓ హనుమంతరావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ఉచిత శిక్షణతో ఆధునిక సాంకేతిక రంగాల్లో

ముందుకు రావాలని ఎమ్మెల్యే గండ్ర పిలుపు

Singareni news

ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి: నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో భూపాలపల్లి పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన డ్రోన్ టెక్నీషియన్ కోర్సు ముగింపు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం సింగరేణి జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, సింగరేణి తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణంగా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ పొందాలంటే సుమారు రూ.50 వేల వరకు ఖర్చవుతుందని, అలాంటి ఖరీదైన కోర్సును భూపాలపల్లి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచితంగా అందించడం గర్వకారణమని అన్నారు. సింగరేణి, టాస్క్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి మొదటి విడతగా 24 మంది యువతకు డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి నైపుణ్య శిక్షణ ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో సుమారు 10 వేల మంది పాల్గొనగా, అందులో 2,700 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం పెరుగుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నాబార్డ్ ద్వారా రైతులు, ఐకేపీ, డ్వాక్రా మహిళా సంఘాలకు సబ్సిడీపై డ్రోన్‌లు అందిస్తు న్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. నిరుద్యోగ యువతకు అత్యాధునిక రంగాల్లో శిక్షణ అందించి ఉపాధి కల్పించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని చెప్పారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో రెండు వారాల పాటు నిర్వహించిన ప్రత్యేక డ్రోన్ టెక్నీషియన్ కోర్సు విజయవంతం కావడం అభినందనీయమని తెలిపా రు. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ వేగంగా విస్తరిస్తున్న అధునాతన రంగమని, గత ఏడాది నాబార్డ్ ద్వారా డ్రోన్ శిక్షణకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో ఆలస్యం జరిగిందన్నారు. యువతకు త్వరగా ఈ అవకాశాన్ని అందించాలనే ఉద్దేశంతో సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, నాబార్డ్ అధికారులు, సింగరేణి అధికారులు, శిక్షణ పూర్తి చేసిన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు
- బకాయిల విడుదలతో కార్మిక సంక్షేమం, కోల్‌బెల్ట్ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు కోరుతూ విజ్ఞప్తి

ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి : సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ నాయకులు కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డ ని కలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహా ఆరు జిల్లాల బీజేపీ అధ్యక్షులు, బీఎంఎస్ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిదర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.52 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి సంస్థ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే సింగరేణి కార్మికుల సంక్షేమం, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం, హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి చెందేందుకు కేంద్రం పూర్తి స్థాయిలో సహకారం అందించాలని వారు కోరారు.

విద్య, వైద్యంలో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానం

- రూ. 2.62 కోట్ల విలువైన సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ
- పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి షాదిముబారక్ కొనసాగింపు
- ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు అడుగులు వేయాలి
- జిల్లాలో సరిపడ యూరియా నిల్వలు
- ప్రభుత్వ వైద్య సేవలను అందరూ వినియోగించుకోవాలి
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



ప్రజానావ, పెద్దపల్లి : జిల్లా కేంద్రంలోని ఆర్.ఆర్ గార్డెన్స్‌లో శనివారం పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించిన వివిధ గ్రామాలకు చెందిన 578 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.2,62,64,750 విలువ గల చెక్కులు పంపిణీ చేసి అనంతరం పెద్దపల్లి మండలం, పట్టణానికి చెందిన 101 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు రూ.1,01,36,745 విలువ గల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు రూ.2.62 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం జరుగుతుందని అన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గంలోని పలువురు అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చేరగా వైద్య ఖర్చుల నిమిత్తం వారికి భరోసాగా ఎల్.ఓ.సి ద్వారా 348 మందికి 9 కోట్ల 88 లక్షల 38 వేల 750 రూపాయల వరకు లబ్ధిదారులకు అందజేసి వారికి బాసటగా నిలిచామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాలు కొనసాగిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద అండగా నిలుస్తున్నామన్నారు. మహిళల సాధికారతకు ఇవి దోహదపడుతున్నాయని, ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణ రావు పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలలో ముందున్నామని ఫ్రీ బస్సు, రైతులకు సన్న వడ్లకు బోనసు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇలా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకు వెళ్తున్నామని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో పయనించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయ్యే విధంగా పాలన కొనసాగుతుందని రైతులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పాలనలో సుభిక్షంగా ఉన్నారని అన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విశేష పురోగతి సాధించామని, గత రెండున్నర సంవత్సరాల్లో విద్యా, వైద్య రంగంలో అనేక సంస్కరణలు అమలు చేసి రాష్ట్రస్థాయి గుర్తింపులు పొందినట్లు తెలిపారు. వానాకా లం సీజన్ పెట్టుబడి సాయంగా తొలి విడతలో 44.28 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ చేశామని దశలవారీగా తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా నిధులు రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుం దని తెలిపారు. పంటల మార్పిడి గురించి రైతంగానికి సూచించడమే కాకుండా తానే స్వయంగా ఆయిల్ ఫామ్ తోటలను పెట్టి ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో పంటల మార్పిడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పెద్దపల్లి నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న దిగుబడులు అధికంగా వస్తున్నాయని, ఈ సీజన్‌లో 2.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 27 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే చెల్లింపులు అందుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల యూరియాను నిల్వలు చేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకో వాలని సూచించడం జరిగింది. అధికంగా యూరియా వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గి భవిష్యత్తు లో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు గుర్తించా లని సూచించారు. రైతులు వరి సాగుతో పాటు ప్రత్యామ్నా య పంటలపై దృష్టి సారించాలని, తెలంగాణ రాష్ట్రం ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఇంకా అవసరమైతే యూరియాను తెప్పిస్తామని ఆయ న స్పష్టం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మాటల్లోనే తప్ప చేతల్లో మాత్రం రైతులకు ఎలాంటి ఉపయోగపడటం లేదన్నారు. వడ్లు, మక్కల కొనుగోలులో రాష్ట్రానికి ఎలాంటి చేయూత అందించడం లేదని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రభుత్వం ప్రకటించిన బోనసు పొందాలంటే రైతులు బీపీటీ, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్, తెలంగాణ సోనా, వరంగల్ 44, 1638, 7715 అనే ఏడు సన్నా వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పెద్దపల్లి మున్సిపల్ ఛైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, డైరెక్టర్లు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నగలు అపహరించిన నిందితుడి అరెస్టు

- తాకట్టు పెట్టిన ఆభరణాలు, దాచిన బంగారు పుస్తెల స్వాధీనం
- విలువైన వస్తువుల భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

S. Madhusudhan

ప్రజానావ, కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని గంజి రోడ్డులో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ సభ్యులకు తెలిసిన వ్యక్తే ఈ చోరీకి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 28వ తేదీ రాత్రి శ్రీమతి కొత్తూరి పద్మ ఇంట్లో బీరువాలో భద్రపరిచిన సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, అందులో బంగారు కమ్మలు, పుస్తెలు, గుండ్లు, పుస్తెల తాడు తదితర వస్తువులు, మొత్తం సుమారు రూ.90 వేల విలువైన నగలను గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. కుటుంబ సభ్యులతో కలిసి వెతికినా ఆభరణాలు దొరకకపోవడంతో జూన్ 30న కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం, అనుమానితులపై విచారణ ఆధారంగా కామారెడ్డి హరిజనవాడకు చెందిన చింతకింద బాలమురళీకృష్ణ (30)ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. కుటుంబ పోషణకు వచ్చే ఆదాయం సరిపోక తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ చోరీకి పాల్పడినట్లు నిందితుడు తెలిపాడు. ఫిర్యాదుదారు తనకు వరుసకు అత్త కావడంతో గతంలో ఇంటి తాళాలు తన వద్ద ఉండటం, ఇంట్లో నగలు ఎక్కడ ఉంచుతారనే విషయం తెలుసుకోవడాన్ని ఆసరాగా చేసుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలను అపహరించినట్లు అంగీకరించాడు. చోరీ చేసిన బంగారు కమ్మలను ఐఐఎఫ్‌ఎల్ రుణాల సంస్థలో, బంగారు గొలుసును కాప్రి గోల్డ్ రుణాల సంస్థలో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బును వ్యక్తిగత ఖర్చులు, అప్పులు తీర్చేందుకు వినియోగించినట్లు తెలిపాడు. అలాగే మూడు బంగారు పుస్తెలను తన టిఫిన్ సెంటర్‌లో దాచిపెట్టినట్లు వెల్లడించాడు. నిందితుడి ఒప్పుకోలు, చూపించిన ప్రదేశాల ఆధారంగా పంచుల సమక్షంలో పోలీసులు ఐఐఎఫ్‌ఎల్ రుణాల సంస్థలో తాకట్టు పెట్టిన బంగారు కమ్మలు, కాప్రి గోల్డ్ రుణాల సంస్థలో తాకట్టు పెట్టిన బంగారు గొలుసు, టిఫిన్ సెంటర్‌లో దాచిన మూడు బంగారు పుస్తెలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తిని కేసు పంచనామా ప్రకారం జప్తు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంటి తాళాలు అవసరం లేనప్పుడు ఇతరులకు ఇవ్వకూడదని, బంగారం, నగదు వంటి విలువైన వస్తువులను సురక్షితంగా భద్రపరచాలని పోలీసులు సూచించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిఘా కెమెరాలు వంటి భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా చోరీ జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

దొడ్డి కొమురయ్య త్యాగం స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఐడీఓసీలో దొడ్డి కొమురయ్య వర్ధంతి

ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య పోరాటం తెలంగాణ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ,, బీసీ అభివృద్ధి శాఖ అధికారి సౌజన్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, కురుమ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

స్వాగతం
సుస్వాగతం
Forest Officer
Additional Collector (Local Bodies)
Project Officer ITDA Utnoor
District Collector
Hon'ble M.P, Adilabad

అభివృద్ధి పనుల్లో మరింత వేగం

- ప్రభుత్వ సేవల్లో పారదర్శకతకు ప్రాధాన్యం
- ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి
- కలెక్టర్ రాజర్షి షా సూచన

ప్రజానావ, ఆదిలాబాద్ : జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, భౌతిక, ఆర్థిక పురోగతి, పెండింగ్ పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, వ్యవసాయం, ఐటీడీఏ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా–శిశు సంక్షేమం, ఉద్యానవనం, అటవీ, గిరిజన సంక్షేమం, క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు, లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ కేంద్ర నిధులతో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో జాప్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. గత సమావేశం అనంతరం పనుల్లో పురోగతి కనిపించిందని, ప్రస్తుతం వర్కింగ్ సీజన్ కావడంతో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాలు నాణ్యంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చొద్దు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- ఆలయం వద్ద ఉద్రిక్తత..
- బీజేపీ నాయకుల్ని అడ్డుకున్న పోలీసులు

భద్రకాళి క్యాంటీన్
BHADRAKALI CA

ప్రజానావ, వరంగల్ : లక్షలాది మంది భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన భద్రకాళి అమ్మవారి ఆలయ పవిత్రతను కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు దెబ్బతీశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దైవమైన భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం తగదని అన్నారు. మాజీ, ప్రస్తుత కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్లు తడి బట్టలతో ఆలయంలోకి ప్రవేశించడం ద్వారా ఆలయ పవిత్రతకు భంగం కలిగించారని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో భద్రకాళి ఆలయంలో పసుపు నీటితో శుద్ధి (సంప్రోక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య కొంత ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు పలువురిని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ను విక్రయిస్తూ రాజకీయ లబ్ధి పొందే నాయకులు ఆలయాల్లో తడి బట్టలతో డ్రామాలు ఆడడం సిగ్గుచేటు చర్య అని విమర్శించారు. దేవాదాయ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే దేవాలయ పవిత్రత దెబ్బతినడం బాధాకరమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వరంగల్‌కు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. కూడా పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ ఇరు పార్టీల నాయకులు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని విమర్శించా రు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని రాజకీయ స్వార్థం కోసం వాడుకోవడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. తమపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు ఆలయ నియమాలను ఉల్లంఘించి భక్తులకు ఇబ్బం దులు కలిగించేలా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని ఆరోపించారు. మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, ప్రస్తుత కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి కలిసి తడి బట్టలతో ఆలయంలోకి ప్రవేశించి ప్రమాణాలు చేయడం శాస్త్ర విరుద్ధమని పేర్కొన్నారు. వారి రాజకీయ స్వార్థం వల్ల అమ్మవారి ఆలయం మైలపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు భద్రకాళి అమ్మవారి భక్తులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేకపోతే భక్తుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వేములవాడకు మరో అభివృద్ధి మైలురాయి

- రూ.200 కోట్ల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన
- ఆధునిక వసతులతో సమగ్ర విద్యా కేంద్రంగా రూపుదిద్దుకోనున్న ప్రతిష్టాత్మక సంస్థ

ప్రజానావ, వేములవాడ: వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి చరిత్రలో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ విద్యాసంస్థ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటు చేయబడుతోంది. అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకోనున్న ఈ విద్యాసంస్థలో ఆధునిక తరగతి గదులు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, విశాలమైన గ్రంథాలయం, క్రీడా మైదానాలు, వసతి గృహాలు వంటి సమగ్ర సదుపాయాలు అందుబాటులో ఉండనున్నాయి. విద్యార్థుల ప్రతిభను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే కేంద్రంగా ఈ పాఠశాల నిలవనుందని అధికారులు తెలిపారు. ఇది కేవలం ఒక విద్యాసంస్థ నిర్మాణం మాత్రమే కాదని, వేలాది మంది పేద మరియు మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలిచే ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది ప్రతీకగా నిలవడంతో పాటు వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిలో మరో స్వర్ణ అధ్యాయంగా నిలిచే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హ్యూస్టన్‌లో 'మ్యాంగో ఫెస్టివల్'

- అమెరికా మార్కెట్‌పై భారత్ గురి
- భారత మామిడి, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణే లక్ష్యం
- ఎగుమతిదారులు, దిగుమతిదారులు, రిటైలర్లతో వాణిజ్య సమావేశాలు

హ్యూస్టన్: భారత మామిడి పండ్లతో పాటు ప్రీమియం వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా ప్రధాన రిటైల్ మార్కెట్లలోకి తీసుకెళ్లే లక్ష్యంతో అమెరికాలోని హ్యూస్టన్‌లో రెండు రోజులపాటు 'మ్యాంగో ఫెస్టివల్–ఇండియా షోకేస్' నిర్వహించారు. భారత కాన్సులేట్ జనరల్, గ్రేటర్ హ్యూస్టన్ ఇండో–అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏసీసీజీహెచ్), వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ) సహకరించింది. మొదటి రోజు కాన్సులేట్‌లో ఎగుమతిదారులు, దిగుమతిదారులు, పంపిణీదారులు, రిటైలర్ల మధ్య బిజినెస్–టు–బిజినెస్ సమావేశాలు నిర్వహించారు. రెండో రోజు హ్యూస్టన్‌లోని కీమత్ స్టోర్‌లో ప్రజలకు అందుబాటులో 'ఇండియా షోకేస్' ఏర్పాటు చేసి భారత మామిడి రకాలను రుచి చూపించారు. ఈ సందర్భంగా భారత కాన్సుల్ జనరల్ డి.సి. మంజునాథ్ మాట్లాడుతూ, భారత వాణిజ్య వ్యవస్థను అమెరికా వ్యాపారవేత్తలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని చెప్పారు. 'ఇండియా–అమెరికా ట్రేడ్ పోర్టల్' ద్వారా విశ్వసనీయ భారత సరఫరాదారులతో నేరుగా అనుసంధానం కావాలని సూచించారు. గ్రేటర్ హ్యూస్టన్ ఇండో–అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపకుడు జగ్‌దీప్ అహ్లూవాలియా మాట్లాడుతూ, అమెరికా దక్షిణ ప్రాంతానికి హ్యూస్టన్ ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రంగా ఉందని, టెక్సాస్ మౌలిక సదుపాయాలను భారత ఎగుమతి సామర్థ్యంతో అనుసంధానించి స్థిరమైన సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెద్దసంఖ్యలో హాజరైన అమెరికాన్లు

కేసర్, చౌసా, లంగ్రా, బంగినపల్లి వంటి భారతీయ మామిడి రకాలను రుచి చూసేందుకు దక్షిణాసియా వలసవాసులతో పాటు స్థానిక అమెరికన్లు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఉత్సాహాన్ని కొనసాగిస్తూ దానిమ్మ, యాపిల్స్, సేంద్రీయ తేనె, కశ్మీరీ కుంకుమపువ్వు వంటి భారత వ్యవసాయ ఉత్పత్తులను కూడా అమెరికా మార్కెట్‌లో విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. భారత మామిడితో పాటు మామిడి ఆధారిత ఉత్పత్తులు, ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన భారత బాస్మతి బియ్యాన్ని కూడా ఈ ప్రదర్శనలో ప్రదర్శించారు. ఈ నెల ప్రారంభంలో సియాటిల్, న్యూయార్క్, వాషింగ్టన్‌లలో కూడా ఇలాంటి మామిడి ఉత్సవాలను నిర్వహించారు.

చమురు టెర్మినల్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

- రష్యా ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా వరుస దాడులు
- 72 డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించిన రష్యా
- యుద్ధానికి నిధులు సమకూర్చే చమురు కేంద్రాలపై దాడులే లక్ష్యం: జెలెన్‌స్కీ



మాస్కో: రష్యాలోని రెండో అతిపెద్ద నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కీలక చమురు టెర్మినల్‌పై ఉక్రెయిన్ శనివారం డ్రోన్ దాడి చేసింది. రష్యా యుద్ధ యంత్రాంగానికి ఆర్థిక బలంగా నిలుస్తున్న ఇంధన మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ వరుస దీర్ఘశ్రేణి దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడులతో రష్యాలో ఇంధన సరఫరాపై ఒత్తిడి పెరుగుతుండగా, క్రెమ్లిన్‌పై రాజకీయ ఒత్తిడి కూడా అధికమవుతోంది. బాల్టిక్ సముద్ర తీరంలోని కిరోవ్‌స్కీ జిల్లాలోని చమురు టెర్మినల్ లక్ష్యంగా డ్రోన్లు దాడి చేశాయని గవర్నర్ అలెగ్జాండర్ బెగ్లోవ్ తెలిపారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరం, పరిసర ప్రాంతాల్లో మొత్తం 72 ఉక్రెయిన్ డ్రోన్లను వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని చెప్పారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఈ దాడిని దీర్ఘశ్రేణి ఆంక్షలలో భాగంగా అభివర్ణించారు. రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చే పోర్టు చమురు మౌలిక సదుపాయాలతో పాటు సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలోని క్రోన్‌స్టాడ్ ద్వీపంలోని కీలక సైనిక స్థావరాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు, రష్యా ఆక్రమిత క్రిమియాలో ఉక్రెయిన్ దాడిలో ఒకరు మరణించగా, 10 ఏళ్ల చిన్నారితో సహా ఇద్దరు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. వరుస దాడుల నేపథ్యంలో అక్కడ సాధారణ ప్రజలకు పెట్రోల్ విక్రయాలపై కూడా పరిమితులు విధించారు.

కొస్త్యాంటినివ్కాపై భిన్న వాదనలు

ఉక్రెయిన్‌లోని వ్యూహాత్మక నగరం కొస్త్యాంటినివ్కాను తమ బలగాలు పూర్తిగా స్వాధీనం చేసుకున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఈ విజయంతో డొనెత్స్క్ ప్రాంతంలోని కీలక నగరాలపై ముందడుగు పడిందని చెప్పారు. అయితే ఈ వాదనను జెలెన్‌స్కీ ఖండిస్తూ, అది రష్యా ప్రచారమేనని వ్యాఖ్యానించారు. నిజంగా నగరం రష్యా ఆధీనంలో ఉంటే అక్కడికే వచ్చి శాంతి చర్చలు జరపాలని పుతిన్‌కు సవాల్ విసిరారు. అయితే జెలెన్‌స్కీ ప్రతిపాదనను క్రెమ్లిన్ తిరస్కరించింది. ఉక్రెయిన్ కీలక నిర్ణయాలకు సిద్ధమైనప్పుడు మాత్రమే మాస్కోలో సమావేశం సాధ్యమని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్‌లోని జపోరిజ్జియా ప్రాంతంపై రష్యా జరిపిన దాడిలో ఇద్దరు చిన్నారులతో సహా ఎనిమిది మంది గాయపడినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు.

డోంబివలిలో రూ.15 లక్షల వసూళ్ల కేసు

- నలుగురు ఆర్టీఐ కార్యకర్తలు అరెస్ట్

ప్రజానావ, ముంబై: డోంబివలి ఎంఐడీసీ ప్రాంతంలో మురుగునీటి కాల్వల పనులపై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవడానికి రూ.15 లక్షలు డిమాండ్ చేసి, ఆ మొత్తాన్ని తీసుకుంటుండగా నలుగురు ఆర్టీఐ కార్యకర్తలను కళ్యాణ్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా అరెస్టు చేశారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదుతో పోలీసులు వలపన్ని దీపేష్ లోఖండే, రాహుల్ ముకాదం, విశాల్ జంకర్, నరేష్ సూర్యవంశీలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై బెదిరింపుల కేసు నమోదు చేయగా, గతంలో కూడా ఇదే తరహా బ్లాక్‌మెయిల్‌లకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. కళ్యాణ్ కోర్టు వారికి ఐదు రోజుల పోలీసు కస్టడీ విధించింది.

సెంథిల్ బాలాజీ, సోదరుడిపై లుక్‌అవుట్ నోటీసులు

- టీవీకే ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర కేసులో దర్యాప్తు ముమ్మరం
- సోమవారం విచారణకు హాజరు కావాలని ఆదేశం
- ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం ఆరోపణల్లో ఇప్పటికే 8మంది అరెస్టు
- ఆరోపణలను ఖండించిన డీఎంకే.. రాజకీయ కక్షసాధింపేనని విమర్శ

చెన్నై: కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం జరిగిందన్న ఆరోపణల కేసులో చెన్నై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో మాజీ మంత్రి, డీఎంకే నేత వి. సెంథిల్ బాలాజీతో పాటు ఆయన సోదరుడు ఆర్.వి. అశోక్‌కుమార్‌పై శనివారం లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. కరూర్ జిల్లా రామేశ్వరపట్టిలోని బాలాజీ నివాసానికి సమన్లు జారీ చేసిన పోలీసులు, జూలై 6న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఇద్దరు సోదరుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఉత్తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఇళయరాజా జూన్ 29న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. స్పీకర్‌పై ప్రతిపాదిత అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తే రూ.35 కోట్ల లంచం ఇస్తామని, తిరస్కరిస్తే తనతో పాటు కుటుంబ సభ్యులకు తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు తిరునావుక్కరసు సహా ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో వారు సెంథిల్ బాలాజీ, అశోక్‌కుమార్ ఆదేశాల మేరకే వ్యవహరించినట్లు వెల్లడైనట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రభుత్వంలోని పలువురు ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టేందుకు సుమారు రూ.180 కోట్ల నిధులు కేటాయించినట్లు కూడా దర్యాప్తులో వెలుగుచూసిందని పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం కరూర్, తిరుచిరాపల్లి, కోయంబత్తూరు, బెంగళూరులో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

హైకోర్టుకు అశోక్‌కుమార్

అరెస్టు అవకాశాల నేపథ్యంలో అశోక్‌కుమార్ ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. తనపై స్వతంత్ర ఆధారాలు ఏవీ లేవని, కేవలం ఇతరుల వాంగ్మూలాల ఆధారంగానే కేసులో ఇరికిస్తున్నారని ఆయన వాదించారు. మరోవైపు, ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర వెనుక డీఎంకే నాయకత్వమే ఉందని టీవీకే మంత్రులు ఆరోపిస్తుండగా, డీఎంకే మాత్రం ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించింది. ఎలాంటి ఆధారాలు లేని కేసుతో రాజకీయ కక్షసాధింపునకు పాల్పడుతున్నారని విమర్శించింది. అదే సమయంలో ముఖ్యమంత్రి విజయ్ కూడా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నారంటూ గవర్నర్, విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ విభాగానికి డీఎంకే ఫిర్యాదు చేసింది.

కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ

- విద్యార్హతల రికార్డులు కోరిన పిటిషన్‌ను తిరస్కరించిన అహ్మదాబాద్ సెషన్స్ కోర్టు
- పరువునష్టం కేసు విచారణలో రికార్డులు ఇవ్వాలన్న అభ్యర్థనకు నో

అహ్మదాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతలకు సంబంధించిన రికార్డులను సమర్పించాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను అహ్మదాబాద్ సెషన్స్ కోర్టు శనివారం తిరస్కరించింది. ఈ అంశంపై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సెషన్స్ కోర్టు సమర్థించింది. పరువునష్టం కేసు విచారణలో భాగంగా ప్రధాని డిగ్రీలకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన అభ్యర్థనను 2026 మార్చి 10న మేజిస్ట్రేట్ తిరస్కరించారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ కేజ్రీవాల్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి పి.బి. పటేల్ ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. ప్రధాని మోదీ డిగ్రీలు నకిలీవి కావచ్చని, గుజరాత్ యూనివర్సిటీ నకిలీ డిగ్రీలు జారీ చేసి ఉండొచ్చని కేజ్రీవాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ పీయూష్ పటేల్ 2023లో క్రిమినల్ పరువునష్టం కేసు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది. గుజరాత్ యూనివర్సిటీ తరఫు న్యాయవాది అమిత్ నాయర్ వాదనలు వినిపిస్తూ, పరువునష్టం కేసులో నిందితులుగా ఉన్న కేజ్రీవాల్, సంజయ్ సింగ్ తమ వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు ఇప్పుడు రికార్డుల పేరుతో ఆధారాలు వెతికే ప్రయత్నం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. చట్టపరంగా అలాంటి ఫిషింగ్ ఎంక్వైరీకి అవకాశం లేదని ఆయన వాదించారు. ఇదే అంశంలో ప్రధాని విద్యార్హతల వివరాలను వెల్లడించాలంటూ కేంద్ర సమాచార కమిషన్ ఇచ్చిన ఆదేశాలను గతంలో గుజరాత్ హైకోర్టు కూడా రద్దు చేసిన విషయం తెలిసిందే.

ఈ పెళ్లి జరగదు!

- హత్యకు ముందే సియా సంకేతాలు
- కేతన్ అగర్వాల్ హత్య కేసులో వెలుగులోకి స్నాప్‌చాట్ సందేశం
- నిజానిజాలపై పోలీసుల విచారణ



పుణె: పుణెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో కీలక ఆధారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన సియా గోయల్ తన స్నేహితురాలికి మే నెలలో పంపినట్లు భావిస్తున్న స్నాప్‌చాట్ సందేశాన్ని పోలీసులు గుర్తించారు. అందులో ఈ పెళ్లి ఎలాగూ జరగదు అని పేర్కొనడం దర్యాప్తులో కొత్త కోణాన్ని తెరపైకి తెచ్చింది. పోలీసుల కథనం ప్రకారం, నవంబర్‌లో ఉదయ్‌పూర్‌లో జరగాల్సిన వివాహానికి టికెట్లు బుక్ చేసేందుకు స్నేహితురాలి ఆధార్ కార్డు రెండు వైపుల ఫొటోలు పంపాలని సియా కోరింది. అదే సందేశంలో పెళ్లి ఎలాగూ జరగదు.. అయినా ఆధార్ పంపు అని పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. కేతన్ కుటుంబ సభ్యులు అప్పటికే వివాహానికి హాజరయ్యే బంధువులు, స్నేహితుల ప్రయాణ ఏర్పాట్ల కోసం అతిథుల పేర్లు, ఆధార్ వివరాలను సేకరిస్తుండగా ఈ సందేశం పంపినట్లు వెల్లడించారు. ఈ సందేశం ప్రామాణికతను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని, అలాగే ఆ స్నేహితురాలికి హత్య కుట్రపై ముందుగానే ఏమైనా సమాచారం ఉందా అనే కోణంలో విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెలలో 25 ఏళ్ల కేతన్ అగర్వాల్‌ను జూన్ 15న పుణె జిల్లా లోహ్‌గడ్ కోట వద్ద లోయలోకి తోసి హత్య చేసినట్లు ఆరోపణలపై అతని కాబోయే భార్య సియా గోయల్ (20), ఆమె ప్రియుడు చేతన్ చౌదరి (22)ను పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, కేతన్ తాత దేవీచంద్ అగర్వాల్ (71) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బీజేపీ పాలనతో యూపీలో సుపరిపాలనకు నాంది

- బుజ్జగింపు రాజకీయాలు, అవినీతికి తెరపడింది
- 2027 ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వస్తాం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

सांसद-विधायक बैठक
मुख्य अतिथि
श्री नितिन
मा. राष्ट्रीय
4 जुलाई, 2026

లక్నో: బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంతో పాటు ఉత్తరప్రదేశ్‌లోనూ బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి, అరాచక పాలనకు ముగింపు పలికి సుపరిపాలనకు బాటలు వేశామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అన్నారు. వచ్చే ఏడాది జరిగే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రెండు రోజుల ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో నితిన్ నబిన్ మాట్లాడారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌధరి, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రజేశ్ పాఠక్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు సమావేశానికి హాజరయ్యారు. 2017కు ముందు ఉత్తరప్రదేశ్, 2005కు ముందు బీహార్ శాంతిభద్రతల సమస్యలు, అవినీతి, కుల రాజకీయాలకు కేంద్రాలుగా ఉండేవని ఆయన ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ ప్రభుత్వాలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించాయని విమర్శించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలనా వ్యవస్థలో గణనీయమైన మార్పు వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని ప్రభుత్వం మాఫియా, గూండాల ప్రభావాన్ని అణచివేసి శాంతిభద్రతలను పటిష్ఠం చేసిందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జాతీయ సమైక్యత మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కులాల పేరుతో సమాజాన్ని విభజించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, సామాజిక మాధ్యమాల ద్వారా బీజేపీ సిద్ధాంతాలను బలహీనపర్చే ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది లబ్ధి పొందారని, లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువ కావాలని, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై బాధ్యతతో వ్యవహరించాలని, పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నితిన్ నబిన్ సూచించారు. రానున్న ఏడు నుంచి ఎనిమిది నెలలు సమన్వయంతో పనిచేస్తే 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక మెజారిటీతో మరోసారి అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



ట్రంప్‌కు అరుదైన కానుక

321 వజ్రాలతో ప్రత్యేక ఉంగరం

బ్రసెల్స్: అమెరికా 250వ స్వాతంత్ర్యోత్సవాల సందర్భంగా బెల్జియంకు చెందిన వజ్రాల పరిశ్రమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అరుదైన బహుమతిని అందజేసింది. మొత్తం 321 వజ్రాలు, 56 రత్నాలు, పచ్చలతో అలంకరించిన ప్రత్యేక బంగారు ఉంగరాన్ని ఆయనకు పంపించింది. ట్రంప్ పేరును సూచించే తొలి అక్షరంతో పాటు అమెరికా జాతీయ పతాకంలోని నక్షత్రాలు, చారలు స్పష్టంగా కనిపించేలా ఈ ఉంగరాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా వజ్రాల పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన యాంట్వెర్ప్ నగరంలో ఈ విలాసవంతమైన ఉంగరాన్ని తయారు చేసినట్లు సమాచారం.

రామాలయ విరాళాలపై సుప్రీం పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలి

- ప్రధాని మోదీకి కేసీ వేణుగోపాల్ లేఖ
- అయోధ్య ఆలయ నిధులపై స్వతంత్ర విచారణకు డిమాండ్
- బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీలపై విమర్శలు

పణజి: అయోధ్య శ్రీరామాలయంలో భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణపై వెలువడుతున్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. గోవాలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిధుల వినియోగంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నందున నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ కేంద్ర హోంశాఖ కార్యదర్శి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, శ్రీరాముడికి సమర్పించిన ఒక కిలో బంగారం లెక్కల్లో నమోదు కాలేదన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొన్నారు. ఇలాంటి అంశాలను విస్మరించకుండా సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలు కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినవని, అయినప్పటికీ ప్రధానమంత్రి మౌనం పాటించడం ఆశ్చర్యకరమని వేణుగోపాల్ విమర్శించారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని అన్నారు.

నిందితులను కాపాడుతున్నాయి

కాంగ్రెస్‌కు భగవంతుడిపై విశ్వాసం ఉంటుందని, అయితే బీజేపీ మాత్రం మతాన్ని రాజకీయ ధ్రువీకరణ కోసం వినియోగించుకుంటోందని ఆరోపించారు. అయోధ్య ఆలయ విరాళాల వ్యవహారంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ పాత్రపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆలయ నిధులను దుర్వినియోగం చేసిన వారిని కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు కాపాడుతున్నాయని ఆరోపించారు. గతంలో ఆలయాల దోపిడీ గురించి తరచూ మాట్లాడిన బీజేపీ, ఇప్పుడు రామాలయంపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇదే సమయంలో కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ ప్రజాప్రతినిధుల ఫిరాయింపులను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వేణుగోపాల్ విమర్శించారు.

ఆఫీస్ స్పేస్ లీజింగ్‌కు స్వల్ప బ్రేక్

- ఏప్రిల్-జూన్‌లో స్థూల లీజింగ్ 1 శాతం తగ్గుదల
- ప్రైమ్ కార్యాలయ స్థలాల కొరతతో నికర లీజింగ్ 14.5 శాతం క్షీణింపు
- గ్లోబల్ అనిశ్చితుల మధ్యనూ భారత్‌పై కంపెనీలపై విశ్వాసం
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడి

CUSHMAN &
WAKEFIELD

న్యూఢిల్లీ: దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాల (ఆఫీస్ స్పేస్) లీజింగ్ కార్యకలాపాలు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో స్వల్పంగా మందగించాయి. నాణ్యమైన (ప్రైమ్) కార్యాలయ స్థలాల కొరత కారణంగా స్థూల (గ్రాస్) లీజింగ్ వార్షిక ప్రాతిపదికన 1 శాతం తగ్గి సుమారు 2.1 కోట్ల చదరపు అడుగులకు పరిమితమైనట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ వెల్లడించింది. ముంబయి, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణె, అహ్మదాబాద్, కోల్‌కతా నగరాలపై విడుదల చేసిన నివేదిక ప్రకారం, నికర (నెట్) లీజింగ్ 14.5 శాతం తగ్గి 1.16 కోట్ల చదరపు అడుగులకు చేరింది. మార్కెట్లో ఇప్పటికే ఆక్రమిత కార్యాలయ స్థలాల్లో వచ్చిన వాస్తవ మార్పునే నెట్ లీజింగ్‌గా పరిగణిస్తారు. కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా, దక్షిణాసియా, మధ్యప్రాచ్య విభాగాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ అన్షుల్ జైన్ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో కంపెనీలు నిర్ణయాలు తీసుకోవడంలో కొంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నప్పటికీ, భారత్‌లో కార్యాలయ స్థలాలపై డిమాండ్ బలంగానే కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) తమ విస్తరణతో మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలుస్తున్నాయని చెప్పారు. గత కొన్నేళ్లుగా గృహాల డిమాండ్ అధికంగా ఉండటంతో అనేక డెవలపర్లు నివాస ప్రాజెక్టులపై దృష్టి పెట్టారని, అయితే ప్రస్తుతం కార్యాలయాల్లో ఖాళీలు తగ్గడం, అద్దెలు పెరగడం, డిమాండ్ నిలకడగా కొనసాగుతున్న నేపథ్యంలో వాణిజ్య భవనాల అభివృద్ధికి మళ్లీ ఊపు వచ్చే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఆఫీస్ రంగం వృద్ధికి మెరుగైన సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఒకే ఓవర్‌లో 29 పరుగులు!

- బిష్ణోయ్ ఖరీదైన ఓవర్‌తో ఇంగ్లండ్ గెలుపు
- రెండో టీ20లో భారత్‌కు నిరాశ
- సూర్యవంశీకి కలిసిరాని అరంగేట్ర మ్యాచ్

మాంచెస్టర్: వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంతో ఆసక్తికరంగా మారిన రెండో టీ20లో భారత్‌కు చేదు అనుభవం ఎదురైంది. విజయానికి చేరువలో ఉన్నట్లు కనిపించిన మ్యాచ్‌లో రవి బిష్ణోయ్ వేసిన ఒకే ఓవర్ ఫలితాన్ని తారుమారు చేసింది. 17వ ఓవర్‌లో ఏకంగా 29 పరుగులు సమర్పించడంతో ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1-0 ఆధిక్యం సాధించింది. 191 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు అర్ష్‌దీప్ సింగ్ తొలి దెబ్బలు ఇచ్చాడు. ప్రమాదకర బ్యాటర్లు ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్‌లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు పంపి భారత్‌కు శుభారంభం అందించాడు. అయితే ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కేవలం 15 బంతుల్లోనే 39 పరుగులు చేసి మ్యాచ్‌ను మళ్లీ తమవైపు తిప్పాడు. అనంతరం జేకబ్ బెథెల్ (76 నాటౌట్; 46 బంతులు), టామ్ బాంటన్ (39; 32 బంతులు) నాలుగో వికెట్‌కు 67 పరుగులు జోడించి ఇంగ్లండ్‌ను విజయానికి చేరువ చేశారు.

నాలుగు ఓవర్లలో 60 పరుగులు

మ్యాచ్‌లో కీలక మలుపు 17వ ఓవర్‌లో చోటు చేసుకుంది. రవి బిష్ణోయ్ వేసిన ఆ ఓవర్‌లో రెండు నోబాల్స్‌తో పాటు మొత్తం 29 పరుగులు రావడంతో భారత్ విజయావకాశాలు ఒక్కసారిగా చేజారిపోయాయి. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న బెథెల్ వరుసగా భారీ సిక్సర్లు బాదుతూ మ్యాచ్‌ను పూర్తిగా ఇంగ్లండ్‌వైపు మళ్లించాడు. చివరకు మరో ఓవర్ మిగిలి ఉండగానే ఆతిథ్య జట్టు విజయాన్ని ఖాయం చేసింది. బిష్ణోయ్ నాలుగు ఓవర్లలో వికెట్ తీయకుండానే 60 పరుగులు సమర్పించగా, అక్షర్ పటేల్ (1/19) మాత్రమే కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌ను ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్‌పై తిలక్ వర్మ (24 నాటౌట్; 11 బంతులు) 17 పరుగులు రాబట్టడంతో భారత్ పోటీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ ఆడిన వైభవ్ సూర్యవంశీ 10 బంతుల్లో రెండు సిక్సర్ల సాయంతో 14 పరుగులు చేసి తన సహజ దూకుడును ప్రదర్శించాడు. పెద్ద ఇన్నింగ్స్‌గా మలచుకోలేకపోయినా భవిష్యత్తుపై ఆశలు రేకెత్తించాడు. అభిషేక్ శర్మ (43), శ్రేయస్ అయ్యర్ (37), ఇషాన్ కిషన్ (49) కూడా విలువైన పరుగులు చేసినా, మధ్య ఓవర్లలో ఇంగ్లండ్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం సాధించలేకపోయారు. సామ్ కరన్ మూడు వికెట్లతో భారత్‌ను దెబ్బతీయగా, విల్ జాక్స్, లియామ్ డాసన్ చెరో వికెట్ సాధించి తమ వంతు పాత్ర పోషించారు.

చరిత్ర సృష్టించిన మొరాకో

- కెనడాపై 3-0తో ఘన విజయం
- ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి క్వార్టర్స్ ఫైనల్‌కు
- ఆఫ్రికా నుంచి రెండుసార్లు క్వార్టర్స్ చేరిన తొలి జట్టుగా రికార్డు

హ్యూస్టన్: ఫిఫా ప్రపంచకప్‌లో మొరాకో మరోసారి తన సత్తా చాటింది. శనివారం జరిగిన ప్రీక్వార్టర్ మ్యాచ్‌లో సహఆతిథ్య దేశం కెనడాపై 3-0తో ఘన విజయం సాధించి వరుసగా రెండోసారి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో ప్రపంచకప్ చరిత్రలో రెండుసార్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా మొరాకో కొత్త చరిత్ర సృష్టించింది. మొదటి అర్ధభాగంలో ఇరు జట్లు గోల్ సాధించలేకపోయాయి. అయితే రెండో అర్ధభాగంలో మొరాకో దూకుడు పెంచింది. 50వ నిమిషంలో అష్రఫ్ హకీమి ఇచ్చిన ఫ్రీకిక్‌ను అజ్జెదీన్ ఔనాహీ అద్భుతంగా గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యం అందించాడు. 82వ నిమిషంలో బ్రాహీమ్ డియాజ్ పాస్‌ను అందుకున్న ఔనాహీ మరో గోల్ చేసి స్కోరును 2-0కు పెంచాడు. అదనపు సమయంలో సౌఫియాన్ రహిమీ మూడో గోల్ నమోదు చేసి మొరాకో విజయాన్ని ఖాయం చేశాడు. ఇదిలా ఉంటే ఈ ఓటమితో ఈ ప్రపంచకప్‌లో కెనడా ప్రయాణం ముగిసింది.

ప్రపంచకప్‌లో తొలిసారి నాకౌట్ మ్యాచ్ గెలిచి ప్రీక్వార్టర్స్‌కు చేరిన కెనడా.. మొరాకోను ఎదుర్కోలేక పోయింది. కెనడా స్టార్ ఆటగాళ్లు జోనాథన్ డేవిడ్, తాజోన్ బుకా నన్‌కు లభించిన అవకాశాలను గోల్‌కీపర్ యాసిన్ బునూ సమర్థంగా అడ్డుకోవడంతో కెనడా ఖాతా తెరవలేకపోయింది. పోటీ మొత్తం ఉత్కంఠభరితంగా సాగగా ఇరు జట్ల ఆటగాళ్లకు కలిపి ఎనిమిది ఎల్లో కార్డులు చూపించారు. తొలి అర్ధభాగంలో మొరాకో మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ సైబరీ గాయంతో మైదానాన్ని వీడడం ఆ జట్టుకు స్వల్ప ఎదురుదెబ్బగా మారింది.

చిన్నస్వామికి ఎల్ఈడీ వెలుగులు

- రూ.5 కోట్లతో ఎల్ఈడీ స్పోర్ట్స్ ఫ్లడ్‌లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు

బెంగళూరు: మౌలిక సదుపాయాల ఆధునికీకరణలో భాగంగా ఎం. చిన్నస్వామి స్టేడియంలోని ఫ్లడ్‌లైటింగ్ వ్యవస్థను కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) పూర్తిగా అప్‌గ్రేడ్ చేసింది. 2010 నుంచి వినియోగంలో ఉన్న మెటల్ హలైడ్ ఫ్లడ్‌లైట్ల స్థానంలో అత్యాధునిక ఎల్ఈడీ స్పోర్ట్స్ ఫ్లడ్‌లైటింగ్ టెక్నాలజీని ఏర్పాటు చేసింది. క్రికెట్‌లో తాజా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ లైటింగ్ వ్యవస్థను రూపొందించినట్లు కేఎస్‌సీఏ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ తెలిపారు. పిచ్‌పై 3,500 లక్స్‌కు పైగా, అవుట్‌ఫీల్డ్‌లో 2,500 లక్స్‌కు పైగా వెలుతురు అందేలా ఏర్పాటు చేయడంతో ఆటగాళ్లు, అంపైర్లు, ప్రేక్షకులు, టెలివిజన్ వీక్షకులకు మరింత స్పష్టమైన విజిబిలిటీ లభిస్తుందని చెప్పారు. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో అమలు చేసిన ఈ ప్రాజెక్టు హెచ్‌డీ, అల్ట్రా హెచ్‌డీ (4కే), సూపర్ స్లోమోషన్ వంటి ఆధునిక ప్రసార సాంకేతికతలకు పూర్తిగా అనుకూలంగా ఉంటుందని వెల్లడించారు. శుక్రవారం విజయవంతంగా పరీక్షలు నిర్వహించిన ఈ ఎల్ఈడీ వ్యవస్థ, సంప్రదాయ ఫ్లడ్‌లైట్లతో పోలిస్తే సుమారు 40శాతం విద్యుత్ ఆదా చేస్తుందని పేర్కొన్నారు. కేఎస్‌సీఏ టీ20 టోర్నీ చివరి దశ మ్యాచ్‌లతో ఈ వ్యవస్థ అధికారికంగా వినియోగంలోకి రానుంది.

పాక్ క్రికెటర్లకు కొత్త కాంట్రాక్టులు

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వచ్చే వారం సెంట్రల్ కాంట్రాక్టు పొందిన ఆటగాళ్ల జాబితాను ప్రకటించనుంది. వెస్టిండీస్ పర్యటన (జూలై 13)కు ముందు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు బోర్డు వర్గాలు వెల్లడించాయి. సెంట్రల్ కాంట్రాక్టుల కోసం మొత్తం పీఎన్ఆర్ 110 కోట్ల (1,100 మిలియన్ పాకిస్థానీ రూపాయలు) నిధులను కేటాయించింది. ఈసారి తొలిసారిగా సాంప్రదాయ ఏ, బీ, సీ, డీ కేటగిరీలకు బదులుగా ఆటగాళ్ల ప్రత్యేకత (టెస్టు, వన్డే, టీ20) ఆధారంగా ఏబీ, ఏ, బీసీ, సీ కేటగిరీలను అమలు చేయనుంది. కనీసం 45 మంది ఆటగాళ్లకు సెంట్రల్ కాంట్రాక్టులు లభించే అవకాశం ఉంది. మహిళా క్రికెటర్ల సెంట్రల్ కాంట్రాక్టుల్లో మాత్రం గణనీయమైన పెంపు చేశారు.

వెంటాడిన గాయం

- వింబుల్డన్ డబుల్స్ నుంచి వైదొలిగిన సెరీనా

లండన్: వింబుల్డన్‌లో సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి డబుల్స్‌లో ఆడాలన్న ఆశలకు సెరీనా విలియమ్స్ మోకాలి గాయం అడ్డుకట్ట వేసింది. కుడి మోకాలికి గాయం కావడంతో మహిళల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్ నుంచి 44 ఏళ్ల సెరీనా శనివారం వైదొలిగింది. ఈ వారం సింగిల్స్‌లో పునరాగమన మ్యాచ్ ఆడిన సందర్భంగా మోకాలికి గాయమైనట్లు సెరీనా వెల్లడించింది. డబుల్స్ నుంచి తప్పుకోవాల్సి రావడం చాలా బాధగా ఉంది. మళ్లీ కోర్టులోకి రావడం, వీనస్‌తో మరోసారి కలిసి ఆడే అవకాశం నాకు ఎంతో ప్రత్యేకం. కోలుకోవడానికి శక్తిమేర ప్రయత్నించినా, నా మోకాలు ఇంకా పోటీకి సిద్ధంగా లేదు అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొంది. సింగిల్స్ మ్యాచ్ అనంతరం మోకాలిలో పేరుకుపోయిన ద్రవాన్ని వైద్యులు తొలగించినట్లు తెలిపిన సెరీనా, చికిత్సకు సంబంధించిన ఫొటోలను కూడా పంచుకుంది. కుడి కాలికి బలమైన సపోర్ట్‌తో నడుస్తున్న వీడియోను కూడా పోస్టు చేసింది. అయితే త్వరలో జరిగే యూఎస్ ఓపెన్‌ను దృష్టిలో పెట్టుకుని తాను మళ్లీ కోర్టులో కనిపిస్తాననే సంకేతాలను సెరీనా ఇచ్చింది. "త్వరలో మీకు సమీపంలోని ఓ నగరంలో నన్ను మళ్లీ చూస్తారు" అంటూ అభిమానుల్లో ఆశలు రేకెత్తించింది. వింబుల్డన్ మహిళల డబుల్స్‌లో వీనస్-సెరీనా జోడీ కామిలా ఒసోరియో-సోలానా సియెరా జంటతో తొలి రౌండ్‌లో తలపడాల్సి ఉంది. సెరీనాకు కోలుకునేందుకు సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ మ్యాచ్‌ను వాయిదా వేశారు.

Business
బిజినెస్

ఏడీఏ గ్రూప్ కేసుల్లో మరో అరెస్ట్

- రిలయన్స్ ఏడీఏ కేసులో మాజీ సీఎఫ్‌వో అమిత్ బాప్నా అరెస్ట్
- నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిన కోర్టు

న్యూఢిల్లీ: రిలయన్స్ ఏడీఏ గ్రూప్‌కు సంబంధించిన ఆర్థిక అక్రమాల కేసుల దర్యాప్తులో భాగంగా రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) అమిత్ బాప్నాను సీబీఐ అరెస్టు చేసింది. రిలయన్స్ క్యాపిటల్‌లో 2014 ఆగస్టు నుంచి 2019 డిసెంబర్ వరకు సీఎఫ్‌వోగా పనిచేసిన ఆయన సంస్థ ఆర్థిక వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకున్న అధికారిగా సీబీఐ పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణ నిబంధనలకు విరుద్ధమని తెలిసినా మధ్యవర్తి, అనుబంధ సంస్థలకు రుణాల మంజూరుకు అనుమతులు ఇచ్చి సహకరించినట్లు దర్యాప్తులో తేలిందని సీబీఐ వెల్లడించింది. దర్యాప్తు ప్రకారం, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్) తీసుకున్న రుణాలను మధ్యవర్తి సంస్థల ద్వారా రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ తదితర ఏడీఏ గ్రూప్ సంస్థలకు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులకు నష్టం వాటిల్లగా, సంబంధిత సంస్థలు అక్రమ లాభం పొందినట్లు సీబీఐ పేర్కొంది. ప్రస్తుతం మరో కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తులో న్యాయ నిర్బంధంలో ఉన్న బాప్నా ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. ఈ కేసులో కస్టడీ కోసం సీబీఐ ముంబై ప్రత్యేక న్యాయస్థానం నుంచి ప్రొడక్షన్ వారెంట్ పొందగా, శుక్రవారం ఆయనను అరెస్టు చేసింది. అనంతరం కోర్టు నాలుగు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఫిర్యాదుల ఆధారంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ టెలికాం సంస్థలపై సీబీఐ మొత్తం ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది.

ఆస్తి పన్ను వసూళ్లలో కొత్త రికార్డ్

- నవీ ముంబైలో మూడు నెలల్లోనే రూ.434.02 కోట్ల పన్ను వసూలు
- గతేడాదితో పోలిస్తే గణనీయమైన వృద్ధి
- డిజిటల్ చెల్లింపులతో పెరిగిన ఆదాయం

థానే: 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నవీ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంఎంసీ) ఆస్తిపన్ను వసూళ్లలో కొత్త రికార్డు సృష్టించింది. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు రూ.434.02 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.372.42 కోట్లు మాత్రమే వసూలవగా, ఈసారి గణనీయమైన వృద్ధి నమోదైంది. నగరంలోని 3,55,772 నమోదిత ఆస్తి యజమానుల్లో 1,43,329 మంది తొలి మూడు నెలల్లోనే పన్నులు చెల్లించారు. సాంకేతికత ఆధారిత పరిపాలన, డేటా విశ్లేషణ, డిజిటల్ చెల్లింపు సౌకర్యాల విస్తరణ వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఎన్ఎంఎంసీ కమిషనర్ కైలాస్ షిండే తెలిపారు. గతంలో పన్ను బకాయిలు చెల్లించని 15,250 మంది డిఫాల్టర్ల నుంచి ప్రత్యేక చర్యల ద్వారా రూ.23.67 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. జోన్ల వారీగా ఘన్సోలి డివిజన్‌లో అత్యధికంగా రూ.80 కోట్ల పన్ను వసూలైంది. ఆస్తుల వారీగా చూస్తే పారిశ్రామిక విభాగం నుంచి 35.79 శాతం ఆదాయం లభించగా, నివాస గృహాల నుంచి 31.92 శాతం, వాణిజ్య ఆస్తుల నుంచి 22.26 శాతం, ఇతర ఆస్తుల నుంచి 10.03 శాతం ఆదాయం సమకూరింది.

డిజిటల్ విధానానికే ప్రాధాన్యం

పన్ను చెల్లింపుల్లో డిజిటల్ విధానాలకే ప్రజలు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. యూపీఐ, క్యూ ఆర్ కోడ్, నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా 1,03,473 మంది రూ.280.71 కోట్లు చెల్లించగా, బ్యాంకు లావాదేవీల ద్వారా మరో రూ.144.93 కోట్లు వసూలయ్యాయి. కేవలం 18.85 శాతం మంది మాత్రమే ఆఫ్‌లైన్ పద్ధతిని ఎంచుకున్నారు. పౌరులకు ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా పంపిన 'పర్సనలైజ్డ్ పేమెంట్ లింక్' కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ విధానం ద్వారా 57,397 మంది ఇంటి నుంచే పన్నులు చెల్లించి దాదాపు రూ.58 కోట్ల ఆదాయం సమకూర్చారు. ఈ ఘనత డిజిటల్ సేవలపై పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని మేయర్ సుజాత పాటిల్ పేర్కొన్నారు. నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని ఇది ప్రతి బింబిస్తోందని ఆమె అన్నారు.

మార్కెట్‌లోకి లేజర్ పవర్ పబ్లిక్ ఇష్యూ

- జులై 9న ప్రారంభం.. 13న ముగియనున్న షేర్ విక్రయం
- రూ.542 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు రూ.200 కోట్ల ఓఎఫ్ఎస్
- రుణాల చెల్లింపునకు రూ.490 కోట్ల వినియోగం

కోల్‌కతా: విద్యుత్ ప్రసార, పంపిణీ రంగానికి అవసరమైన పవర్ కేబుల్స్, కండక్టర్లు, ప్రత్యేక ఉత్పత్తులను తయారు చేసే లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ (ఎల్‌పీఐఎల్) రూ.742 కోట్ల ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ను జూలై 9న ప్రారంభించనుంది. ఈ ఇష్యూ జూలై 13న ముగియనుందని కంపెనీ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌లో వెల్లడించింది. ఈ ఐపీఓలో రూ.542 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు, ప్రమోటర్ల వాటా నుంచి రూ.200 కోట్ల విలువైన ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కూడా ఉంది. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.490 కోట్లను రుణాల చెల్లింపులు లేదా ముందస్తు చెల్లింపులకు వినియోగించగా, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. పశ్చిమ బెంగాల్‌లో మూడు తయారీ యూనిట్లను నిర్వహిస్తున్న ఎల్‌పీఐఎల్‌కు మొత్తం 85,448 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,326 కోట్ల ఆదాయం, రూ.151 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2026 మార్చి 31 నాటికి సంస్థ ఆర్డర్ బుక్ విలువ రూ.3,243 కోట్లుగా ఉంది. అమెరికాకు చెందిన టీఎస్ కండక్టర్ సంస్థకు లైసెన్స్ పొందిన స్ట్రాండింగ్ భాగస్వామిగా ఉన్న ఎల్‌పీఐఎల్, తక్కువ బరువు, అధిక సామర్థ్యం, మెరుగైన ఇంధన పొదుపు కలిగిన ఆధునిక కండక్టర్లను దేశీయంగా తయారు చేస్తోంది. భారతీయ రైల్వేలు, ఒడిశాలోని విద్యుత్ పంపిణీ సంస్థలు, పలు ప్రైవేట్ ఈపీసీ కంపెనీలు సంస్థ ప్రధాన వినియోగదారులుగా ఉన్నాయి. క్రిసిల్ అంచనా ప్రకారం, మౌలిక వసతుల అభివృద్ధి, రైల్వే విద్యుదీకరణ, స్మార్ట్ గ్రిడ్ ప్రాజెక్టులు, ఎగుమతుల డిమాండ్‌తో దేశీయ కేబుల్స్, వైర్ల మార్కెట్ వార్షికంగా సగటున 13 శాతం వృద్ధి నమోదు చేసే అవకాశముంది.

LASER
POWER & INFRA

ఈ20 పెట్రోల్‌పై అపోహలు వద్దు

- శాస్త్రీయ పరీక్షల తర్వాతే దేశవ్యాప్తంగా అమలు
- ముడిచమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యం: పరిశ్రమ వర్గాలు
- పాత, కొత్త వాహనాలన్నింటికీ సురక్షితమేనని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: 20 శాతం ఎథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ20) వినియోగంపై ప్రజల్లో ఉన్న సందేహాలను పరిశ్రమ వర్గాలు కొట్టిపారేశాయి. విస్తృత శాస్త్రీయ పరీక్షల అనంతరమే ఈ20 ఇంధనాన్ని దేశవ్యాప్తంగా అమలు చేశామని, ఇది పాత, కొత్త వాహనాలన్నింటికీ సురక్షితమేనని స్పష్టం చేశాయి. అలాగే ముడి చమురు దిగుమతులపై దేశం ఆధారాన్ని తగ్గించడంలో ఈ20 కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నాయి. ప్రభుత్వ జాతీయ మీడియా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ సీఎండీ వర్తికా శుక్లా మాట్లాడుతూ, 2030 లక్ష్యానికి ముందుగానే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలపై విస్తృత పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఈ20 ఇంధనాన్ని దశలవారీగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వాహన పనితీరుపై స్వల్ప ప్రభావం ఉండొచ్చని, అయితే అది డ్రైవింగ్ అలవాట్లపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఎథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమం శాస్త్రీయ ప్రమాణాల ప్రకారమే అమలవుతోందని వివరించారు. మారుతి సుజుకి ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భారతి మాట్లాడుతూ, 2023కు ముందు తయారైన ఈ10 వాహనాలపై కూడా ఈ20 ఇంధనంతో పరీక్షలు నిర్వహించామని, వాహన భాగాల మన్నిక, తుప్పు, పనితీరు విషయంలో ఎలాంటి సమస్యలు కనిపించలేదని తెలిపారు. టయోటా కిర్లోస్కర్ మోటార్ కంట్రీ హెడ్ విక్రమ్ గులాటి మాట్లాడుతూ, ఎథనాల్ స్వచ్ఛమైన, అధిక సామర్థ్యం కలిగిన ఇంధనమని పేర్కొన్నారు. ఇటీవల ప్రపంచ ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయాలు దిగుమతులపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో గుర్తు చేశాయని అన్నారు. ఎథనాల్ వినియోగం పెరగడం వల్ల ఇంధన భద్రత బలోపేతం కావడంతో పాటు, ఎథనాల్ తయారీకి అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి రైతులకు కూడా అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు.



నిజంగా 'వారణాసి' సెట్స్‌దేనా?

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్యాన్–వరల్డ్ చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దాదాపు రూ.1300 కోట్ల భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ స్థాయి విజువల్ స్టాండర్డ్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. పూర్తిస్థాయిలో ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్న ఈ సినిమా గ్లోబ్–ట్రాటింగ్ టైమ్ ట్రావెల్ యాక్షన్ అడ్వెంచర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో మహేష్ బాబు 'రుద్ర' అనే శక్తివంతమైన ప్రధాన పాత్రలో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక కథలో కీలకమైన 20 నిమిషాల రామాయణ ఘట్టంలో మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి ప్రియాంకా చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తుండగా, మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. సినిమా కథ ఆఫ్రికాలోని దట్టమైన అడవులు, మంచు ఖండం అంటార్కిటికా, అలాగే పవిత్ర పుణ్యక్షేత్రం వారణాసి చుట్టూ తిరుగుతుందని ప్రచారం జరుగుతోంది. వీటికి సంబంధించిన ప్రధాన యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తైనట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ఉగాది సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే తాజాగా సోషల్ మీడియాలో ఓ ఫొటో వైరల్‌గా మారింది. అందులో మహేష్ బాబు రాముడి గెటప్‌లో చేతిలో విల్లు, వెనుక బాణాలతో ఎంతో గంభీరంగా కనిపిస్తున్నారు. ఈ లుక్‌ను చూసిన అభిమానులు ఫిదా అవుతూ, శ్రీరాముడి పాత్రకు మహేష్ బాబు పర్‌ఫెక్ట్‌గా సరిపోతారని కామెంట్లు చేస్తున్నారు. థియేటర్లలో ఈ గెటప్ కనిపిస్తే స్క్రీన్లు దద్దరిల్లిపోవడం ఖాయమంటూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ఫొటో నిజంగా 'వారణాసి' సినిమా షూటింగ్ సెట్స్ నుంచి లీక్ అయిందా? లేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో అభిమానులు సృష్టించారా? అనేది ప్రస్తుతం ఆసక్తికర చర్చగా మారింది. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీతో నటీనటుల లుక్స్‌ను అత్యంత సహజంగా రూపొందించడం సాధారణమైపోయిన నేపథ్యంలో, ఈ ఫొటో వెనుక అసలు నిజం ఏమిటో తెలుసుకోవాలంటే దర్శకుడు రాజమౌళి టీమ్ లేదా చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

వయసు పెరిగేది హీరోయిన్లకేనా?

వెండితెరపై గ్లామర్ హీరోయిన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించి, అనంతరం వైవిధ్యమైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న బాలీవుడ్ నటి తాప్సీ పన్ను తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఎప్పుడూ భిన్నమైన ఆలోచనలు, స్పష్టమైన అభిప్రాయాలతో వార్తల్లో నిలిచే తాప్సీ ఈసారి సోషల్ మీడియాకు దూరంగా ఉండటానికి గల కారణాలతో పాటు సినీ పరిశ్రమలో మహిళలపై ఉన్న వివక్షతపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నేటి కాలంలో సోషల్ మీడియా సినీ తారల వృత్తిలో కీలక భాగంగా మారిపోయినప్పటికీ, నిరంతరం అందులో యాక్టివ్‌గా ఉండాలనే ఒత్తిడి, మారుతున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా పరుగులు తీయాల్సిన పరిస్థితులు తనను మానసికంగా తీవ్ర అలసటకు గురి చేశాయని ఆమె తెలిపారు. ఈ హడావుడి జీవితం ఒక ముగింపు లేని పరుగు పందెంలా అనిపించడంతోనే గత ఏడాది నుంచి సోషల్ మీడియా ప్రపంచానికి కొంత విరామం ఇచ్చినట్లు వెల్లడించారు. అయితే తాను సోషల్ మీడియాను పూర్తిగా బహిష్కరించలేదని, కేవలం అందులోనే పూర్తిగా మునిగిపోవడం తనకు ఇష్టం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితానికి, మనశ్శాంతికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నానని చెప్పారు. ఇదే సమయంలో సినీ పరిశ్రమలో హీరోయిన్ల విషయంలో వయస్సును ప్రస్తావిస్తూ వివక్ష చూపడం జరుగుతోందని, "వయసు పెరిగేది హీరోయిన్లకేనా?.. హీరోలకు పెరగదా?" అంటూ ప్రశ్నిస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాప్సీ 'గాంధారి' ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు.

షూటింగ్‌లో దూసుకెళ్తోన్న 'స్పిరిట్'

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, బాలీవుడ్ నటి త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ తెరకెక్కిస్తున్న భారీ మాస్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించనున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ నుంచి వరుసగా డేట్లు లభించడంతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేసినట్లు సమాచారం.ఇదిలా ఉండగా, ఈ చిత్ర షూటింగ్‌కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రచారం ప్రస్తుతం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆ సమాచారం ప్రకారం ఇప్పటికే సినిమా చిత్రీకరణ దాదాపు 60 నుంచి 70 శాతం వరకు పూర్తయినట్లు టాక్ నడుస్తోంది. అంటే మిగిలిన భాగం మాత్రమే చిత్రీకరించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే వచ్చే ఏడాది మార్చిలో సినిమాను విడుదల చేసే దిశగా చిత్రబృందం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల్లో నిజం ఉంటే 'స్పిరిట్' నిర్ణయించిన సమయానికే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తుండగా, భద్రకాళి పిక్చర్స్ మరియు టీ–సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పాన్ ఆసియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సమాచారం.

ఎన్‌బీకే-112లో సరికొత్తగా బాలయ్య!

టాప్ రైటర్–డైరెక్టర్ కొరటాల శివ తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను ఫైనల్ చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కనున్న ఎన్‌బీకే–112 చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు కొరటాల శివ చేపట్టనున్నట్లు సమాచారం. పవర్‌ఫుల్ కథలను సామాజిక సందేశాలతో మిళితం చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన కొరటాల శివ, ఈసారి బాలయ్య కోసం మరో బలమైన కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయి పొలిటికల్ డ్రామా నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రం కొరటాల శివ మార్క్ పవర్‌ఫుల్ నరేషన్‌తో పాటు భారీ స్థాయి కమర్షియల్ అంశాలను కలిగి ఉండబోతున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం కెరీర్‌లో అత్యున్నత దశలో దూసుకుపోతున్న బాలకృష్ణను కొత్త కోణంలో ఆవిష్కరించడం కొరటాల శివకు పెద్ద సవాల్‌గా మారిందని చెప్పాలి. గతంలో ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు వంటి స్టార్ హీరోలను విభిన్నమైన స్టైల్స్‌లో అత్యంత పవర్‌ఫుల్‌గా స్క్రీన్‌పై ప్రజెంట్ చేసి భారీ విజయాలు అందుకున్న కొరటాల శివ, ఇప్పుడు బాలయ్యను ఎలా చూపించబోతున్నారన్న ఆసక్తి నందమూరి అభిమానుల్లో భారీగా పెరిగింది. ఈ సినిమా కోసం ఆయన సిద్ధం చేసిన కథలో బాలయ్య పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతుందని సమాచారం. కేవలం హీరోను స్టైలిష్‌గా చూపించడమే కాకుండా, కథలో బలమైన భావోద్వేగాలు, రాజకీయ అంశాలు, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండేలా కొరటాల ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. భారీ అంచనాల మధ్య తెరకెక్కనున్న ఈ సినిమా ద్వారా కొరటాల శివ, బాలయ్య కాంబినేషన్ ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

రూ.400 కోట్ల భరణం నిజమేనా?



బాలీవుడ్‌లో అత్యంత చర్చనీయాంశంగా మారిన సెలబ్రిటీ విడాకులలో స్టార్ హీరో హృతిక్ రోషన్, ఆయన మాజీ భార్య సుసానే ఖాన్ విడిపోవడం ఒకటి. 2014లో ఈ జంట అధికారికంగా విడిపోయిన సమయంలో సుసానే ఖాన్ తన భర్త హృతిక్ రోషన్ నుంచి ఏకంగా రూ.400 కోట్ల భారీ మొత్తాన్ని భరణంగా డిమాండ్ చేసి తీసుకుందనే వార్తలు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారమయ్యాయి. హృతిక్ స్టార్ హీరో కావడంతో ఆ భారీ మొత్తం చెల్లించాడని కూడా అప్పట్లో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే ఎన్నో ఏళ్లుగా వైరల్ అవుతున్న ఈ ప్రచారాలపై తాజాగా సుసానే ఖాన్ సోదరి, ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ ఫరా ఖాన్ అలీ స్పందిస్తూ షాకింగ్ విషయాలను బయటపెట్టారు. ఈ మొత్తం ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆమె స్పష్టం చేశారు. సుసానే ఎలాంటి భరణం తీసుకోలేదని, ఈ విషయంలో జరుగుతున్న ప్రచారం తమ కుటుంబాన్ని ఎంతో బాధపెడుతోందని చెప్పారు. ఒక ఇంటర్వ్యూలో ఫరా ఖాన్ అలీ మాట్లాడుతూ.. ఈ వివాదంపై మాట్లాడి పూర్తిగా ముగించేయాలని నేను చాలా సార్లు సుసానేకి చెప్పాను. కానీ ఆమె మాత్రం ప్రజలు మాట్లాడేవి మాట్లాడుతూనే ఉంటారు, వాటి వల్ల నా జీవితంలో ఎలాంటి మార్పు రాదని భావిస్తుంది. బహుశా అందుకే ఇప్పటికీ హృతిక్ కుటుంబంతో సుసానేకి మంచి అనుబంధం కొనసాగుతోంది అని తెలిపారు. అలాగే విడాకుల తర్వాత హృతిక్ తన సోదరికి రూ.400 కోట్లు ఇచ్చాడని, ఆ డబ్బుతో సుసానే ఒక్కసారిగా ధనవంతురాలైపోయిందనే వ్యాఖ్యలు చూసినప్పుడల్లా తనకు చాలా బాధ కలుగుతుందని చెప్పారు. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, హృతిక్ నుంచి సుసానే ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. మా తల్లిదండ్రులు మమ్మల్ని విలువలతో పెంచారు. డబ్బు లేదా సౌకర్యాల కోసం బ్రతకాలని ఎప్పుడూ నేర్పించలేదు. సుసానే తన జీవితాన్ని విలువలతోనే నడిపిస్తుంది. ఆమె ఎవరి దగ్గర నుంచి ఏదైనా ఆశించే వ్యక్తి కాదు. ఆమె గోల్డ్ డిగ్గర్ కాదు. మేము ఎంతో గౌరవప్రదమైన కుటుంబం నుంచి వచ్చాం. మాకు కొన్ని విలువలు ఉంటాయి అంటూ ఫరా ఖాన్ అలీ స్పష్టం చేశారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న హృతిక్–సుసానే విడాకుల భరణం వివాదానికి ఎట్టకేలకు ఫుల్ స్టాప్ పడినట్లైంది.

ఆ పిలుపు కోసం రెండేళ్లు!

మెగా బ్రదర్ నాగబాబు కుమార్తెగా తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన నిహారిక కొణిదెల తన సినీ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, ధైర్యంగా ముందుకు సాగుతూ ప్రస్తుతం విజయవంతమైన నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. తొలుత 2015లో ఈటీవీలో ప్రసారమైన 'ఢీ జూనియర్స్' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా తన కెరీర్‌ను ప్రారంభించిన నిహారిక, అనంతరం నాగశౌర్య హీరోగా తెరకెక్కిన 'ఒక మనసు' సినిమాతో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమయ్యారు. అయితే ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా నిరుత్సాహపడకుండా తన లక్ష్యంపై దృష్టి పెట్టారు. ఆ తర్వాత 'హ్యాపీ వెడ్డింగ్', 'సూర్యకాంతం', 'సైరా నరసింహారెడ్డి', 'డార్లింగ్' వంటి చిత్రాల్లో నటించారు. ఇదే సమయంలో 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌ను స్థాపించి 'ముద్దపప్పు అవకాయ్', 'నాన్న కూచీ', 'మ్యాడ్ హౌస్', 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ', 'హలో వరల్డ్', 'బెంచ్ లైఫ్' వంటి వెబ్ సిరీస్‌లను నిర్మించారు. వ్యక్తిగత జీవితంలో వివాహం, విడాకుల కారణంగా కొంతకాలం సినీ పరిశ్రమకు దూరమైన నిహారిక ఆ తర్వాత నిర్మాతగా స్థిరపడాలని నిర్ణయించుకుని వరుస విజయాలను అందుకుంటున్నారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో కొత్తవారికి అవకాశమిస్తూ విజయాన్ని అందుకున్న ఆమె, ఈ ఏడాది 'రాకాస' సినిమాతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం తన సోదరుడు వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కుతున్న 'బరి' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే నిహారిక తాజాగా కాశీ యాత్రకు సంబంధించిన ఫొటోలు, భావోద్వేగ పోస్ట్‌ను షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది. కాశీ మనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో మాటల్లో చెప్పలేం. కాశీ మనల్ని మనకు చూపిస్తుంది, నిజం మాత్రమే మిగిలేలా అన్ని భ్రమలను తొలగిస్తుంది. వారణాసి నేలపై అడుగుపెట్టిన క్షణంలో కొత్త ప్రాంతానికి వచ్చిన భావన కాదు, సొం తింటికి తిరిగి వచ్చిన అనుభూతి కలిగింది. మహాదేవుడిని నా మార్గదర్శిగా పిలుచుకునే అదృష్టం, ఆయనకు కూతురిగా ఉండే వరం ప్రతి జన్మలోనూ నాతో ఉండాలని కోరుకుంటున్నాను" అంటూ నిహారిక భావోద్వేగానికి గురయ్యారు.

అలా అంటే పెద్ది కొడతాడు

అక్కినేని నట వారసుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన అఖిల్ అక్కినేని తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడానికి నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భారీ అంచనాల మధ్య సినీ రంగ ప్రవేశం చేసినప్పటికీ, ఇప్పటివరకు ఆయన నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ ప్రతి సినిమాలో కొత్తగా కనిపించేందుకు, నటుడిగా తనను తాను నిరూపించుకునేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా 'ఏజెంట్' సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో దాదాపు మూడేళ్ల పాటు కొత్త ప్రాజెక్టును ప్రకటించకుండా కథల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రస్తుతం ఆయన 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, అక్కినేని నాగార్జునతో కలిసి సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇదిలా ఉంటే తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అఖిల్ ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన 'పెద్ది' సినిమా గురించి యాంకర్ ప్రశ్నించగా అఖిల్ ఆసక్తికరంగా స్పందించారు. "అవును.. నేను సినిమా చూశాను. నిజం చెప్పాలంటే రామ్ చరణ్ నటన అద్భుతంగా ఉంది. ఆయన ఆ పాత్రలో పూర్తిగా జీవించేశారు. సినిమా చూస్తున్నంతసేపూ నాకు రామ్ చరణ్ అసలు కనిపించలేదు" అని చెప్పిన అఖిల్ వెంటనే నవ్వుతూ "రామ్ చరణ్ గారు అంటే నన్ను కొడతాడు.. చరణ్ అంటాను" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం మాట్లాడుతూ "నిజంగా సినిమా చూస్తున్నప్పుడు ప్రతి సన్నివేశంలో నాకు చరణ్ కనిపించలేదు, 'పెద్ది' పాత్ర మాత్రమే కనిపించింది. ఒక స్టార్ హీరో తన ఇమేజ్‌ను పూర్తిగా పక్కనపెట్టి పాత్రలో లీనమై నటించడం అంత సులభమైన విషయం కాదు. అదే గొప్ప నటుడి లక్షణం. చరణ్ ఆ పాత్రకు పూర్తిగా న్యాయం చేశారు" అని ప్రశంసించారు. అలాగే "ఒక సినిమాలో ప్రేక్షకులు నటుడిని మర్చిపోయి పాత్రను మాత్రమే గుర్తుంచుకునేలా చేయడం చాలా అరుదు. 'పెద్ది'లో చరణ్ అదే చేశారు" అని అన్నారు. మరోవైపు రామ్ చరణ్, అఖిల్ అక్కినేని ఇద్దరూ మంచి స్నేహితులే కాకుండా కుటుంబ సభ్యుల్లా ఆప్యాయంగా ఉంటారు. ఒకరి సినిమాలకు, కార్యక్రమాలకు మరొకరు హాజరవుతూ పరస్పరం ప్రోత్సహించుకుంటూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే 'పెద్ది' సినిమాపై మాట్లాడిన అఖిల్, రామ్ చరణ్ నటనపై తనకున్న అభిమానాన్ని మరోసారి వ్యక్తం చేశారు.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277